TGTEL/25/A0880

# నమస్తే భారత్

తెలుగు దినపత్రిక

NAMASTHE BHARAT TELUGU DAILY

న్యాయమిత్ర న్యూస్ దినపత్రిక
నమస్తే భారత్ తెలుగు దినపత్రిక
NAMASTHE BHARAT TELUGU DAILY

మన సమాజంలో జరుగుతున్న న్యాయపరమైన, చట్టపరమైన మరియు సామాజిక సమస్యలపై సందేహాలు మరియు పరిష్కారం కొరకు ఒక నిబద్ధతతో కూడిన సంబంధిత సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయనిపుణుల సహకారంతో పరిష్కార వేధికగా నమస్తే భారత్ మరియు న్యాయమిత్ర వేదికగా నిలుస్తుంది.. అలాగే ప్రభుత్వ విభాగంలో నేలకొనియున్న అన్ని సమస్యలకు పరిష్కార మార్గం చూపుతుంది. మీకు మరియు మీ చుట్టు పక్కల వారి హక్కుల ఉల్లంఘనను, మీకు జరిగిన అన్యాయం గురించి ఫిర్యాదులను మరియు వాటికీ సంబందిచిన సమాచారని, సాక్షాలతో మాకు తెలియపరచగలరు.. ..ఎడిటర్ డెస్క్ 94916 23567

మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 09 | ఎడిటర్ : కందాడి మహేందర్ రెడ్డి | బుధవారం, జూన్,10, 2026 | పేజీలు : 8 | వెల : రూ.4/-



లాభాల్లో ముగిసిన స్టాక్

## మార్కెట్లు

- సెన్సెక్స్ 394, నిఫ్టీ 119 పాయింట్ల మేర లాభం
- ర్యాలీని నడిపించిన పీఎస్‌యూ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లు

**ఇంటర్నెట్ న్యూస్,జూన్9**

గత రెండు సెషన్లుగా కొనసాగుతున్న వరుస నష్టాలకు మంగళవారం బ్రేక్ పడింది. దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ట్రేడింగ్ చివరి గంటలో కొనుగోళ్ల మద్దతు వెల్లువెత్తడంతో సూచీలు గణనీయంగా పుంజుకున్నాయి. మార్కెట్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 394.50 పాయింట్ల లాభంతో 73,918.76 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 119.10 పాయింట్ల వృద్ధితో 23,242.10 వద్ద స్థిరపడ్డాయి.

# మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం

- హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం
- పరేడ్ గ్రౌండ్స్‌లో మహిళా శక్తి సభ
- వర్షంలో తడుస్తూనే వేదికపైకి సీఎం రేవంత్, మంత్రులు
- మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సుల పంపిణీ

### జోరు వానను లెక్కచేయని రేవంత్ రెడ్డి..
### మహిళా సంఘాలకు బస్సుల పంపిణీ

**హైదరాబాద్,జూన్9**

హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ముంచెత్తినప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కార్యక్రమాలను కొనసాగించారు. మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'మహిళా శక్తి' మహాసభలో ఆయన పాల్గొన్నారు. కుండపోత వర్షంలోనూ తన సహచర మంత్రులతో కలిసి వేదికపైకి చేరుకున్న ముఖ్యమంత్రి, మహిళా స్వయం సహాయక సంఘాల కోసం కేటాయించిన 553 కొత్త ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు.సభ జరుగుతున్న సమయంలో నగరంలో భారీ వర్షం కురిసింది. అయినప్పటికీ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు వేదిక వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆయన జెండా ఊపి బస్సులను లాంఛనంగా ప్రారంభించడంతో పాటు స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన హైర్ ఛార్జీల చెక్కులను పంపిణీ చేశారు.'ఇందిరా మహిళా శక్తి' వంటి వినూత్న పథకాల ద్వారా మహిళలకు ఆర్థిక అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ పథకంలో భాగంగా మహిళా సంఘాలు కొనుగోలు



చేసిన బస్సులను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు (టీఎస్ఆర్టీసీ) లీజు ప్రాతిపదికన అందజేస్తారు.మహిళా సంఘాలు తయారుచేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తూ.. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లతో అనుసంధానం చేశామని, హైటెక్ సిటీలో 106 ప్రత్యేక విక్రయ స్టాళ్లను ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. 'ఇందిరా మహిళా శక్తి' భవనాల నిర్మాణంతో పాటు పాఠశాల యూనిఫాంల తయారీ, పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ జనరేషన్ వంటి రంగాల్లోకి మహిళా సంఘాలను విస్తరించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళల విద్య, ఉపాధికి ఎంతగానో తోడ్పడుతోందని, విమర్శలు వచ్చినా ఈ పథకాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సభ ముగింపులో గ్రామీణ ఆదాయాన్ని పెంచేందుకు వీలుగా.. పంటల మార్పిడి, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతుల్లో అవగాహన కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి మహిళా ప్రతినిధులకు పిలుపునిచ్చారు.

దమ్ముంటే బహిరంగ

# చర్చకు రావాలి

- అభద్రతా భావంతో రేవంత్ వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారన్న కిషన్ రెడ్డి
- రాష్ట్ర అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై చర్చకు రావాలని సవాల్
- ఒక్క ప్రాజెక్టును అడ్డుకున్నట్టు నిరూపించినా రాజీనామా చేస్తానన్న కిషన్ రెడ్డి



**హైదరాబాద్,జూన్9,**


కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై, కేంద్ర ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... అహంకారం, అభద్రతా భావం, తీవ్ర నిరాశతోనే రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలకు, తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం

- తెలంగాణకు రెండ్రోజుల పాటు ఎల్లో అలర్ట్ జారీ
- ఈదురుగాలులకు కూలిన చెట్లు, నిలిచిన విద్యుత్ సరఫరా

**హైదరాబాద్,జూన్9,**

నైరుతి రుతుపవనాల ఆగమనానికి ముందే తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ముంచెత్తగా, రాష్ట్రంలోని పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ



'ఎల్లో అలర్ట్' జారీ చేసింది.



మమతా బెనర్జీకి

## మరో షాక్

- ఎమ్మెల్యేల సంతకాల ఫోర్జరీ కేసులో సోదాలు
- మమత నివాసం చిరునామాతోనే పార్టీ కార్యాలయం ఉన్నందున తనిఖీలు

**ఇంటర్నెట్ న్యూస్,జూన్9**


అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, ఎమ్మెల్యేలు, ఎంపీల తిరుగుబాటుతో ఇప్పటికే పీకల్లోతు కష్టాల్లో ఉన్న మమతా బెనర్జీకి మరో తలనొప్పి వచ్చిపడింది. శాసనసభ్యుల సంతకాల ఫోర్జరీ ఆరోపణల కేసు దర్యాప్తులో భాగంగా ఆ రాష్ట్ర సీఐడీ అధికారులు మంగళవారం మమతా బెనర్జీ నివాసానికి చేరుకున్నారు.

# రిఫండ్‌లో జాప్యం..

### విద్యార్థినికి రూ.74,131 పరిహారం చెల్లించనున్న ఎయిరిండియా

**న్యూఢిల్లీ,జూన్9,**

విద్యార్థినికి చేరాల్సిన ప్రయోజనాలను నిరాకరించడంతో పాటు, రిఫండ్ చెల్లింపులో తీవ్ర జాప్యం చేసిన ఎయిరిండియా సంస్థపై రాజస్థాన్ వినియోగదారుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది.




బాధితురాలైన విద్యార్థినికి రూ. 74,131 పరిహారంగా చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది.

# మండుతున్న ఎండలు

### శరీర ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటితే ప్రాణాంతకమే!

**హైదరాబాద్,జూన్9**

దేశవ్యాప్తంగా తీవ్రమైన వడగాల్పులు ప్రజలను వణికిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్ దాటి నమోదవుతుండటంతో ప్రజారోగ్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.




వైద్య నిపుణుల ప్రకారం, అధిక వేడి వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు దశలవారీగా తీవ్రమవుతాయి. తొలుత కండరాల నొప్పులు, వాపులు, సొమ్మసిల్లడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీని తర్వాత అలసట, తలతిరగడం, వికారం, తీవ్రమైన చెమటలతో కూడిన 'హీట్ ఎగ్జాషన్' దశకు చేరుకుంటుంది. అత్యంత ప్రమాదకరమైన 'హీట్‌స్ట్రోక్' దశలో శరీర ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ దాటితే, మెదడు, గుండె, కిడ్నీల వంటి అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇది మూర్ఛ, కోమా వంటి ప్రాణాంతక పరిస్థితులకు దారితీయవచ్చు.వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, గుండె జబ్బులు, అధిక రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, బయట పనిచేసే కార్మికులు ఈ వేడికి ఎక్కువగా ప్రభావితమవుతారు.

ఏపీలో ప్రైవేట్

# కాలేజీలకు ఊరట

- రూ.15 లక్షల నిబంధన ఎత్తివేత
- ప్రైవేట్ కాలేజీల్లో కొత్త కోర్సులకు రూ.15 లక్షల కార్పస్ ఫండ్ రద్దు
- కొత్తగా కాలేజీ పెడితే మాత్రం కార్పస్ ఫండ్ తప్పనిసరి
- కోర్సుల అనుమతికి ప్రాంతాల వారీగా కొత్త ఫీజుల విధానం



**అమరావతి,జూన్9,**

ఏపీలోని ప్రైవేట్ విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీలలో కొత్త కోర్సులను ప్రారంభించేందుకు చెల్లించాల్సిన రూ.15 లక్షల కార్పస్ ఫండ్ నిబంధనను రద్దు చేస్తూ ఉన్నత విద్యాశాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. దీనివల్ల ఇకపై అదనపు కోర్సులు ప్రవేశపెట్టాలనుకునే యాజమాన్యాలకు ఆర్థిక భారం తగ్గనుంది.అయితే, ఈ వెసులుబాటు కేవలం ఇప్పటికే ఉన్న కాలేజీలకు మాత్రమే వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. కొత్తగా ఒక ప్రైవేట్ కాలేజీని స్థాపించాలనుకుంటే మాత్రం, నిబంధనల ప్రకారం రూ.15 లక్షల కార్పస్ ఫండ్ తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుందని ఉత్తర్వులలో పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ

- మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ
- తెలంగాణ కోర్టు కేసు వివరాలు దాచిపెట్టారని బీజేపీ అభ్యంతరం
- ఇది కేసు కాదని, కేవలం నోటీసు మాత్రమేనని వాదించిన కాంగ్రెస్

**హైదరాబాద్,జూన్9**

మధ్యప్రదేశ్ రాజ్యసభ ద్వివార్షిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ తరఫున ఏకైక అభ్యర్థిగా బరిలో ఉన్న మీనాక్షి నటరాజన్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి మంగళవారం



తిరస్కరించారు. తెలంగాణ కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఒక కేసుకు సంబంధించిన సమాచారాన్ని ఆమె ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారంటూ బీజేపీ లేవనెత్తిన అభ్యంతరంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.వివరాల్లోకి వెళితే, హైదరాబాద్ కోర్టులో మీనాక్షి నటరాజన్‌పై ఒక పిటిషన్ దాఖలైంది. అయితే, బీజేపీ ఆరోపణలను కాంగ్రెస్ నేత ఉమంగ్ సింఘార్ "బలవంతపు రాజకీయాలు"గా అభివర్ణించారు.

వృద్ధి రేటు పెంపుపై

# సీఎం చంద్రబాబు ఫోకస్..

- వివిధ శాఖలకు కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు నిర్దేశించిన సీఎం
- పనితీరు ఆధారంగా స్కోరింగ్ విధానం అమలుకు నిర్ణయం
- ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికల రూపకల్పన
- ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఏఐ టాస్క్ ఫోర్స్ ఏర్పాటుపై ఆలోచన
- 2047 స్వర్ణాంధ్ర లక్ష్య సాధన కోసం డేటా ఆధారిత పాలనపై దృష్టి

**అమరావతి,జూన్9**

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు, వృద్ధి రేటును పరుగులు పెట్టించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యాచరణ ప్రారంభించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) లక్ష్యాలు, ప్రభుత్వ శాఖల పనితీరును కొలిచే కీ-పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల (కేపీఐ)పై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఆర్థిక, ప్రణాళిక, వ్యవసాయ, రవాణా, పర్యాటక శాఖల



ఉన్నతాధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో వివిధ శాఖలకు కేపీఐలను సీఎం నిర్దేశించారు.

నమస్తే భారత్
తెలుగు దినపత్రిక
NAMASTHE BHARAT TELUGU DAILY


# హైదరాబాద్ అభివృద్ధిని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం: కేపీ

-ఫోర్త్ సిటీ ప్రచారంలో ఉన్న నగర సమస్యలను పక్కన పెట్టారని విమర్శ-సుచిత్ర--కొంపల్లి ఫ్లైఓవర్ పనుల జాప్యంపై ఆగ్రహం-బాచుపల్లి ఫ్లైఓవర్ సహా నగర అభివృద్ధి ప్రాజెక్టులు బీఆర్ఎస్ హయాంలోనే రూపుదిద్దుకున్నాయని వ్యాఖ్య-పేర్లు మార్చడం తప్ప కొత్తగా చేపట్టిన అభివృద్ధి పనులు కనిపించడం లేదని ఆరోపణ-ప్రజల అవసరాల కంటే ప్రచార కార్యక్రమాలకే ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని విమర్శ




కుత్బుల్లాపూర్, జూన్ 9: ( నమస్తే భరత్); హైదరాబాద్ నగర అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, కొత్త ప్రాజెక్టుల ప్రకటనలకే పరిమితమై ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ విమర్శించారు. సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బాచుపల్లి చౌరస్తాలో నూతనంగా ప్రజలకు అందుబాటులోకి వచ్చిన ఫ్లైఓవర్‌ను సోమవారం పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. బాచుపల్లి ఫ్లైఓవర్‌తో పాటు హైదరాబాద్ నగరంలో చేపట్టిన అనేక కీలక అభివృద్ధి పనులు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రూపుదిద్దుకున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రారంభించిన పనులను పూర్తి చేసి ప్రారంభించడం మినహా కొత్తగా చేపట్టిన ప్రధాన అభివృద్ధి కార్యక్రమం ఏదీ కనిపించడం లేదన్నారు. అభివృద్ధి పనుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని అసెంబ్లీ వేదికగా పలుమార్లు ప్రశ్నించిన ఫలితంగానే బాచుపల్లి ఫ్లైఓవర్ పనులు వేగవంతమై ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ప్రజల ప్రయోజనాల కోసం అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నిరంతరం పోరాడే పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని అన్నారు. ఫోర్త్ సిటీ పేరుతో కొత్త నగర నిర్మాణంపై ప్రభుత్వం విస్తృత ప్రచారం చేస్తోందని, అయితే ఇప్పటికే ఉన్న హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్, మౌలిక సదుపాయాలు, పెండింగ్ ప్రాజెక్టుల సమస్యలను విస్మరిస్తోందని ఆరోపించారు. నగరాభివృద్ధిపై స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా సుచిత్ర--కొంపల్లి ఫ్లైఓవర్ నిర్మాణాన్ని



పూర్తి చేయలేకపోయిందని ఆయన విమర్శించారు. పనుల జాప్యానికి బాధ్యత వహించాల్సిన ప్రభుత్వం కేంద్రంపై నెపం నెట్టడం ద్వారా తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఆర్డీపీ, ఎస్ఎన్డీపీ పథకాల కింద చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రస్తుతం హెచ్-సిటీ పేరుతో కొత్త ముద్ర వేయడం తప్ప రాష్ట్ర ప్రభుత్వం సాధించింది ఏమీ లేదని ఆరోపించారు. పేర్లు మార్చడం ద్వారా ప్రజలను మభ్యపెట్టలేరని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి కంటే ప్రచార కార్యక్రమాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ప్రజల అవసరాలు, నగర సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ నగర ప్రయోజనాలను కాపాడగల రాజకీయ శక్తి బీఆర్ఎస్ మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాయినగర్ డంపింగ్ యార్డ్‌కు శాశ్వత పరిష్కారం చూపిస్తాం

- ఫిర్యాదు అందిన వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న మంత్రి- ప్రజారోగ్యానికి ముప్పుగా మారిన డంపింగ్ యార్డ్‌పై ఆందోళన- పూర్తిస్థాయి శుభ్రత చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు- సమస్య పరిష్కారానికి జిల్లా యంత్రాంగం సమన్వయంతో చర్యలు- మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లిన కొలన్ హన్మంత్ రెడ్డి




బాచుపల్లి, జూన్ 9 ( నమస్తే భరత్): బాచుపల్లి పరిధిలోని సాయినగర్‌లో టీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్ అండ్ డిగ్రీ కాలేజ్ ఫర్ గర్ల్స్ సమీపంలో ఏర్పడిన డంపింగ్ యార్డ్ కారణంగా స్థానిక ప్రజలు, విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తక్షణ స్పందన చూపారు. సమస్యపై స్థానిక నాయకులు, ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో మంగళవారం ఆయన స్వయంగా ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న దుర్వాసన, దోమల వ్యాప్తి, పారిశుధ్య లోపాలతో ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా సమీపంలోని బాలికల విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థినులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజారోగ్యం, పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రభుత్వం రాజీపడదని స్పష్టం చేశారు. డంపింగ్ యార్డ్‌ను పూర్తిగా శుభ్రపరచడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన చర్యలను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మంత్రిని కలిసి సమస్య తీవ్రతను వివరించారు. స్థానిక ప్రజలు, విద్యార్థినుల ఆరోగ్యం దృష్ట్యా డంపింగ్ యార్డ్ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి వేగంగా చర్యలు



చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరీతో పాటు వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు. సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలను సమన్వయంతో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సాయినగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి చర్యలు ప్రారంభించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని, ఈ పర్యటన అందుకు నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు.

## ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ ప్రోగ్రాం పదేళ్లు గడచిన సందర్భంగా అవగాహన సదస్సు

డాక్టర్ స్రవంతి పి హెచ్ సి చించోడు- జె.శ్రీనివాసులు హెల్త్ ఎడ్యుకేటర్

నమస్తే భారత్ షాద్ నగర్ జూన్09: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చించోడులో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ ప్రోగ్రాం మన భారతదేశంలో ప్రారంభించి ఈరోజుకు 10 సంవత్సరముల నిండిన సందర్భంగా, చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ స్రవంతి ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ ప్రోగ్రాం కు వచ్చిన గర్భవతులకు , ప్రతినెల 9వ తారీకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం లో, గర్భవతులకు అందించే సేవల గురించి వివరంగా తెలియజేశారు. ప్రతి నెల 9వ తేదీన ప్రభుత్వాసుపత్రిలో గర్భిణీలకు అన్ని రకాల పరీక్షలు , ఫ్రీ ఆ సేవలు అందిస్తున్నామని తెలియజేశారు. పి హెచ్ సి యు అందించే సేవలు హైరిస్క్ గర్భిణీల వ్యక్తిగత పర్యవేక్షణ గురించి , సురక్షిత ప్రసవం యొక్క పాలో అప్ గురించి, గర్భిణీలకు 102 వాహనం ద్వారా అందే ఉచిత రవాణా సౌకర్యం గురించి, సురక్షిత ప్రసవం కోసం సమీప ఫస్ట్ రిఫరల్ యూనిట్ గురించి, అధిక ప్రమాద గర్భధారణల గుర్తింపు గురించి, ప్రభుత్వాసుపత్రుల కాన్పుల గురించి, ప్రభుత్వాసుపత్రిలో ఇచ్చే వ్యాక్సిన్ ల గురించి, గర్భిణీ స్త్రీలకు అందించే ఐ ఎఫ్ ఏ మాత్రల గురించి, ప్రత్యేక గర్భిణీ సేవలను ఉచితంగా అందిస్తున్నామని డాక్టర్ స్రవంతి గర్భవతులకు తెలియజేశారు. తదుపరి హెల్త్ ఎడ్యుకేటర్ జె .శ్రీనివాసులు మాట్లాడుతూ స్త్రీలు గర్భం దాల్చిన మూడు నెలల్లోపు ఏ.ఎన్.ఎమ్ ల దగ్గర రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి అని, గర్భవతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారందరికీ



వెంటనే మూత్ర పరీక్షలు , రక్తం పరీక్షలు, బీ.పీ పరీక్షలు, థైరాయిడ్ పరీక్ష మరియు షుగర్ పరీక్షలు నిర్వహించి వారికి తగిన చికిత్స ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందిస్తారని జె.శ్రీనివాసులు తెలియజేశారు. గర్భవతులు అందరూ కూడా మంచి పోషకాహారము అనగా తాజా ఆకుకూరలు, తాజా కూరగాయలు, ఉడకబెట్టిన గుడ్లు, తాజా పండ్లు, పాలు ఆహారంలో భాగంగా తీసుకోవాలని జె.శ్రీనివాసులు చెప్పారు. ప్రతి గర్భిణి స్త్రీ ప్రతినెల తప్పకుండా చెకప్ లు చేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, ఎం ఎల్ హెచ్ పి వైద్య అధికారి డాక్టర్ సంధ్య, హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, హెల్త్ సూపర్వైజర్ శ్రీ రామ, ల్యాబ్ టెక్నీషియన్ అశోక్, డీ.ఈ.వో విజయ, ఏ.ఎన్.ఎమ్.లు మధువాణి, అనురాధ మరియు ఆశలు పాల్గొన్నారు.

## సుభాష్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల సమస్యలపై ఎమ్మెల్యే వివేక్ ఆకస్మిక తనిఖీ

- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం.. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యల ఆదేశం-కుత్బుల్లాపూర్ అభివృద్ధి నిరంతర ప్రక్రియ.. అన్ని ప్రాంతాలకు మెరుగైన వసతులు కల్పిస్తాం : ఎమ్మెల్యే కేపీ వివేకానంద్





కుత్బుల్లాపూర్, జూన్ 9 ( నమస్తే భరత్ ): ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత అని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే జేపీ వివేకానంద కేపీ వివేకానంద్ పేర్కొన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని రాజుల స్వామి నగర్, సిద్ధార్థ్ నగర్, జై శ్రీరామ్ నగర్, మరాఠీ బస్తీలలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను ఆయన మంగళవారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రాజుల స్వామి నగర్‌లో భూగర్భ డ్రైనేజీ అవుట్‌లెట్ సమస్యను, సిద్ధార్థ్ నగర్‌లో భూగర్భ డ్రైనేజీ, పారిశుధ్య లోపాలు, వరద నీటి నిల్వ సమస్యలను, జై శ్రీరామ్ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం, నాలా నిర్వహణ సమస్యలను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. ప్రజల నుంచి నేరుగా సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ, భూగర్భ డ్రైనేజీ పనుల అమలులో అధికారుల నిర్లక్ష్య ధోరణిపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ సమస్యల పరిష్కారంలో జాప్యం ఎందుకు జరుగుతోందని అధికారులను ప్రశ్నించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే అంశాలపై ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ, గత 12 సంవత్సరాలుగా కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లామని తెలిపారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, ప్రజల అవసరాలకు అనుగుణంగా రానున్న రోజుల్లో కూడా సుభాష్‌నగర్ డివిజన్‌తో పాటు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లావణ్య, ఈఈ సుబ్రహ్మణ్యం, డీజీఎం శ్రావణి, వివిధ శాఖల అధికారులు, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, పోలే శ్రీకాంత్, వారాల వినోద్, రాజ్‌కుమార్ ముదిరాజ్, కోల శ్రీకాంత్ ముదిరాజ్, గుబ్బల లక్ష్మీనారాయణ, రవి, వేణు, మరాఠీ అశోక్, స్వామి, చందు, గట్టు అశోక్, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు ఇవ్వాలి పనికి తగ్గ వేతనాలు, సంక్షేమ చర్యలు అవసరం

-కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకరిస్తా : ఎమ్మెల్యే కేపీ వివేకానంద్




కుత్బుల్లాపూర్, జూన్ 9 ( నమస్తే భరత్ ) : భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు లభించడంతో పాటు వారి పనికి తగ్గ వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగాల కార్మికుల ట్రేడ్ యూనియన్ సుభాష్ నగర్ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వినతిపత్రం ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ, రోజురోజుకు పెరుగుతున్న జీవన వ్యయం, నిర్మాణ రంగంలో మారుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. భవన నిర్మాణ కార్మికుల కష్టాన్ని గుర్తించి వారికి పనికి తగిన వేతనాలు, సామాజిక భద్రతా సౌకర్యాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు. కార్మికుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్మిక సంక్షేమం, హక్కుల పరిరక్షణ విషయంలో ఎల్లప్పుడూ అండగా ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ రంగాల కార్మికుల ట్రేడ్ యూనియన్ సుభాష్ నగర్ కమిటీ అధ్యక్షుడు పి. శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పి. వెంకయ్య, కార్యదర్శి వి. శ్రీనివాస్, యూనియన్ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.



## లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిధుల మంజూరు హర్షణీయం భూసేకరణ పూర్తి చేసి పనులు త్వరగా ప్రారంభించాలి

-ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కి (ఏఐఎస్ఎఫ్ )తరపున విప్లవ వందనాలు- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు ఆకాష్ నాయక్

నమస్తే భారత్ ?షాద్‌నగర్ జూన్ 09:దశాబ్దాలుగా మన ప్రాంత రైతాంగం కంటున్న లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ కలను సాకారం చేస్తూ, భూసేకరణ కొరకు ఏకంగా రూ. 587 కోట్లు మంజూరు చేయించిన షాద్‌నగర్ నియోజకవర్గ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, మన ప్రియతమ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరన్న గారు రిజర్వేర్ సాధన చేసి చూపించారు" అని అఖిల భారత విద్యార్థి సమైక్య తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు ఆకాష్ నాయక్ కొనియాడారు. ఈ చారిత్రాత్మక విజయం సాధించినందుకు శంకరన్నకు అఖిల భారత విద్యార్థి సమైక్య తరపున హృదయపూర్వక విప్లవ వందనాలు తెలియజేశారు. ?మాట ఇస్తే తప్పని శంకరన్న గత పదేళ్ల కాలంలో ఎంతో మంది సీనియర్ నాయకుల వల్ల కాని పనిని, కొత్తగా ఎమ్మెల్యేగా అడుగుపెట్టినప్పటికీ అత్యంత కీలకమైన, చిట్టచివరి ప్రాజెక్టు అయిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని పట్టుబట్టి ఒప్పించి రూ. 587 కోట్లు సాధించడం శంకరన్న అకుంఠిత దీక్షకు నిదర్శనమన్నారు. రైతుల పక్షపాతి శంకరన్న నియోజకవర్గ ప్రజల మీద, రైతుల మీద ఉన్న ప్రేమతోనే శంకరన్న ఈ అద్భుతాన్ని సృష్టించారని, ఈ నిధుల వల్ల ఇక్కడి గిరిజన తండాల వలసల కన్నీళ్లకు త్వరలోనే ముగింపు పడబోతుందని హర్షం వ్యక్తం చేశారు.?రైతులకు ఇబ్బంది



లేకుండా పనులు జరగాలి శంకరన్న తన అమోఘమైన కృషితో నిధులైతే సాధించి తెచ్చారని, ఇకనైనా అధికారులు స్పందించి.. అక్కడ ఉన్నటువంటి రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, పారదర్శకంగా భూసేకరణ పూర్తి చేసి యుద్ధప్రాతిపదికన రిజర్వాయర్ నిర్మాణ పనులను ప్రారంభించాలని ఆకాష్ నాయక్ కోరారు. షాద్‌నగర్ రైతాంగ శ్రేయస్సు కోసం, రిజర్వాయర్ నిర్మాణంలో భాగస్వామ్యమవుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరన్న గారు తీసుకునే ప్రతి ప్రజాపక్ష నిర్ణయానికి అఖిల భారత విద్యార్థి సమైక్య ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఆకాష్ నాయక్ స్పష్టం చేశారు.

# సంపాదకీయం

## సమాజానికి చీడలా..డ్రగ్స్ మహమ్మారి

ఉడ్తా పంజాబ్... పేరుతో ఆనాడు గోలగోల జరిగింది. పంజాబ్ మాదక ద్రవ్యాలకు నిలయంగా మారింది. అక్కడ యువత పెడదారి పడుతోందని దేశవ్యాప్తంగా ఆందోళన వెల్లువెత్తింది. దీనిపై సినిమాలు వచ్చాయి. ఇప్పుడు దేశంలో ఎక్కడో ఒకచోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గంజాయి రవాణా, మాదక ద్రవ్యాల వినియోగం ఆందోళన కలిగిస్తోంది.గంజాయి మత్తులో అనేకానేక హత్యాచారాలు జరిగాయి. ఇటీవల మదనపల్లెలో ఓ దుండగులు బాలికను హత్యాచారం చేసిన సంగతి చూశాం. మద్యం, మత్తు పదార్థాలు సమాజాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నా పాలకులు పట్టించు కోవడం లేదు. కఠిన చర్యలు తీసుకోవడం లేదు. దీంతో గంజాయి బ్యాచ్‌లు రెచ్చి పోతున్నాయి. నిత్యం కాపలా కాసి పట్టుకుంటున్నా గంజాయి రవాణా ఆగడం లేదు. రేవ్ పార్టీలు, ఫామ్ హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ విచ్చలవిడి వినియోగం మరింత ఆందోళన కలిగిస్తోంది. ప్రజాప్రతినిధులే డ్రగ్స్ స్వీకరిస్తే సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు. మొయినా బాద్ ఫామ్‌హౌజ్‌లో తెలంగాణ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేశ్‌లు పట్టుబడడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి వారిని రాజకీయాల నుంచి తరిమేయాలి. ఇలాంటి వారిని ప్రజాజీవితానికి దూరం చేయాలి. మొగ్గలోనే తుంచే యాలి. ఇలాంటి వారు మళ్లీ రాజకీయ జీవితంలోకి రాకుండా కఠిన ఆంక్షలు విధించాలి. ఇలాంటి వారి వల్లనే నేర సామ్రాజ్యం విస్తరిస్తుంది. డ్రగ్స్ ఎంతటి దారుణానికైనా తెగించేలా చేస్తుంది. హైదరాబాద్ నగర శివార్లలోని మొయినాబాద్ అజీజ్ నగర్ లో గల మాజీ ఎంఎల్ఎ పైలట్ రోహిత్ రెడ్డి ఫాం హౌస్ లో జరిగిన డ్రగ్స్ పార్టీని ఈగల్, ఫోర్త్ సిటీ పోలీసులు గుట్టురట్టు చేయడం వెనుక భారీ ఆపరేషన్ కొనసాగింది. ఈ పార్టీలో ప్రముఖులు వున్నట్లు, ఇందులో డ్రగ్స్ వాడుతున్నట్లు సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు దీనిపై స్థానిక పోలీసుల సహకారంతో గత రాత్రి పది గంటల సమయంలో దాడులు చేయడం తెలిసిందే. ఈ సమయంలో అక్కడ ఒక మహిళతోపాటు 11 మంది వున్నారు. వీరంతా మద్యం మత్తులో వుండగా కొందరు డ్రగ్స్ సేవించినట్లు అనుమానాలు వుండడంతో అందరికి డ్రగ్స్ పరీక్షలు జరిపారు. ఇదే సమయంలో వాష్ రూం వద్ద చేతిలో ఎ32 కాలిబర్ రివాల్వరన్ను పట్టుకుని వుండగా అతన్ని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అతని పేరు నమిత్ శర్మగా తేలింది. ఇతని చేతిలో వున్న రివాల్వర్ జర్మనీలో తయారైనట్లు తేలింది. ఇతనికి సమీపంలో మరో వ్యక్తి ఖాళీ తూటా పట్టుకుని వుండగా అతన్ని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఇతన్ని సిల్వేరి శరత్‌కుమార్గా గుర్తించారు. ఇతని వద్ద 26 గ్రాముల కొకైన్, భారీగా మద్యం సీసాలు పట్టుబడ్డాయి. ఘటనా స్థలంలో తూటాతో పాటు మొత్తం 4 ఖాళీ తూటాలు లభ్యమయ్యాయి. రివాల్వర్ తోపాటు తూటాను, ఖాళీ తూటాలను పరీక్షల నిమిత్తం ఎఫ్ఎస్ఎల్‌కు పరీక్షల నిమి త్తం పంపారు. ఎక్కడో యూరప్, ఆఫ్రికా దేశాల్లో ఉన్న ఈ దురలవాటు మెల్లగా మనదేశంలోకి అడుగుపెట్టి ఆందోళనకు గురి చేస్తోంది. మెక్సికోలో డ్రగ్స్ మాఫియా డాన్ ఎలా నేర సామ్రాజ్యాన్ని స్థాపించాడో ఇటీవలే చూశాం. అతడిని ఎన్‌కౌంటర్ చేశరు. అలాగే ఇక్కడి నేరాలను కూడా ఆదిలోనే అదుపు చేయకపోతే సమాజానికి క్యాన్సర్‌లా పట్టిపీడిస్తుంది. 1980లో ఎల్మెంచో కాలిఫోర్నియాలో హెరాయిన్ సరఫరా చేస్తూ పోలీసులకు దొరికాడు. కొంతకాలం జైలుశిక్ష కూడా అను భవించాడు. తిరిగి మెక్సికోకి వచ్చాక కొన్నాళ్లు పోలీసుగా పనిచేశాడు. ఆపై అన్ని మెళకువలు తెలుసుకున్నాకదాన్ని వదిలిపెట్టి 2009లో తన డ్రగ్ మాఫియాకు ప్రాణం పోసాడు. అనూహ్యంగా ఆ ముఠా 2015లో 20 మంది పోలీసుల్ని తలలు నరికి చంపేసింది. అప్పట్నించిమెంచో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ జాబితాలోకి చేరి పోయాడు. ఎల్మెంచో వద్దనున్న ఆయుధ సంపత్తి అలాంటిలాంటిది కాదు. సాయుధ వాహనాలు, రాకెట్ లాంఛర్లు, భారీ ఎత్తున ఆయుధాలను కూడా మెక్సికో సైన్యం స్వాధీన పరుచుకొంది. అతని ముఠాలో ఉన్న వాళ్లంతా కిరాయి హంతకులుగా పేరుపడిన వారే. తనకు ఎదురు తిరిగిన ప్రభుత్వాధి కారుల్ని నిర్దాక్షిణ్యంగా చంపేవాడు. ఈ ముఠా మెక్సికో సైన్యానికి సవాల్‌గా మారింది. అతడి నేర సామ్రాజ్యాన్ని పెంచిపోషించిన వారెవరో అందరికీ తెలుసు. ఇది ప్రపంచానికి ఓ గుణపాఠం కావాలి. తెలంగాణ మాజీ న క్సలైట్ నయీమ్‌ను పెంచి పోషించిందెవరో అందరికీ తెలుసు. ఇలా నేరగాళ్లను ప్రోత్సహించడం వల్ల సమాజం ఛిద్రం కాగలదని గుర్తించాలి. అందుకే నేర స్వభావం ఉన్న వారికి ఏ రూపంలోనూ సకహరించ కూడదు. భారాస మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో పట్టుబడిన ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌తో పాటు అతని స్నేహితుడు నమిత్‌శర్మల మత్తు చరిత్ర కొత్త అనుమానాలు రేకెత్తి స్తోంది. మత్తు మందులు వాడే అలవాటు వీరికి గతంలోనూ ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. దిల్లీ వాసి నమిత్‌శర్మ, ఏలూరు ఎంపీ మహేశ్‌ల నుంచి సేకరించిన నమూనాల్లో ఇతర మాదకద్రవ్యాల అవశేషాలు కూడా లభించడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. వాస్తవానికి తాజా కేసు దర్యాప్తుతో దీనికి సంబంధం లేకపోయినప్పటికీ మత్తు మందుల సరఫరా మూలాలను గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతోనే పోలీసులు పాత విషయాలనూ తవ్వితీయబోతున్నారు. పార్టీలో తాము డ్రగ్స్ వాడలేదని నిందితులు తొలుత బుకాయించినప్పటికీ పోలీసుల పరీక్షల్లో మొత్తం 11 మందిలో ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. ఇందులో నమిత్‌శర్మ నుంచి సేకరించిన నమూనాల్లో యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్, కొకైన్ ఆనవాళ్లు లభించాయి. పుట్టా మహేశ్ నుంచి సేకరించిన నమూనాల్లో యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్ ఆనవాళ్లు దొరికాయి. మిగతా నలుగురూ కొకైన్ వాడినట్లు తేలింది. పోలీసులు ప్రశ్నించినప్పుడు తాను సిమ్లా నుంచి కొకైన్ తీసుకొచ్చా నని బెంగళూరుకు చెందిన కౌషిక్ రవి వెల్లడించాడు. వారి సోదాల్లోనూ కొకైన్ మినహా ఇతరత్రా మత్తు మందులేవీ అక్కడ దొరకలేదు. కానీ, నమిత్‌శర్మ, పుట్టా మహేశ్‌ల నమూనాల్లో మాత్రం ఇతర మాదక ద్రవ్యాల ఆనవాళ్లు లభించాయి. వారిద్దరూ వీటిని జరిగిన పార్టీలో తీసుకున్నారా...? అంతకు ముందే వాడారా..? అనే వివరాలన్నీ తదుపరి దర్యాప్తులో వెల్లడవుతాయని పోలీసులు చెబుతున్నారు. వీటన్నింటినీ పరిశీలిస్తే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో చిక్కిన వారందరికీ కొంతకాలంగా మత్తుమందులు వాడే అలవాటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. పరీక్షలు చేసినపుడు ఆరుగురు డ్రగ్స్ వాడగా, అందులో ఐదుగురు కొకైన్ తీసుకున్నట్లు తేలింది. మొత్తంగా ఈ కేసుతో పాటు గతంలో పట్టుబడ్డ కేసులను కూడా విచారించాలి. అక్రమ సంపాదనకు అలవాటు పడ్డవారు డ్రగ్స్ పార్టీలకు అలవాటు పడుతున్నారు. తెలంగాణ లో గతంలో సినీ రంగాన్ని కూడా మాదకద్రవ్యాల కేసు ఓ కుదుపు కుదిపింది. కానీ ఆ కేసు ఆచూకీ లేకుండా పోయింది. వీటిని ఇలాగే వదిలేస్తే రేపు సమాజానికి సవాల్‌గా మారుతుందని గుర్తించాలి.



# వాతావరణ సంక్షోభం వైపు భారత్

మన దేశం బహుళ వాతావరణ సంక్షోభం అంచులపై ఉంది. గణాంకాలు, అనుభవాలు, రోజువారీ జరుగుతున్న సంఘటనలు ఈ వాస్తవాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ఈ సంక్షోభం ఒక్కసారిగా ఉద్భవిం చింది కాదు, సంవత్సరాలుగా కూడబెట్టుకున్న పర్యావరణ నిర్లక్ష్యం, అభివృద్ధి నమూనాల్లోని అసమతుల్యతల ఫలితమే అన్నది ఛేదు నిజం. భారత వాతావరణ విభాగం ప్రకారం 2025 సంవత్సరం దేశ చరిత్రలో ఎనిమిదవ అత్యంత వేడిమి సంవత్సరంగా నమోదైంది. సగటు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 0.28లీజ అధికంగా నమోదయ్యాయి. ఈ సంఖ్య చిన్నదిగా కనిపించినా, వాతావరణ శాస్త్రంలో ఇది తీవ్రమైన మార్పులకు సంకేతం. ముఖ్యంగా 2016--2025 దశకం దేశ చరిత్రలోనే అత్యంత వేడి కాలంగా నిలవడం పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టంగా చూపుతోంది. 2026లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది. మార్చి నెల నుంచే పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4లీజ నుంచి 8లీజ వరకు అధికంగా నమోదవుతున్నాయి. వసంత కాలం క్రమంగా క్షీణించి, వేసవి ముందుగానే దాడి చేస్తోందన్న నిపుణుల అభిప్రాయం దీనికి బలం చేకూరుస్తోంది. 2025 సంత్సరంలో దాదాపు 330కి పైగా రోజుల్లో దేశవ్యాప్తంగా ఎక్కడో ఒకచోట తీవ్రమైన వాతావరణ ఘటనలు నమోదయ్యాయి. తొలి తొమ్మిది నెలల్లో 99% రోజుల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం, ఈ పరిస్థితి ఎంత సాధారణంగా మారిందో తెలియజేస్తోంది. ఈ ఘటనల ఫలితంగా 4,000కు పైగా ప్రాణ నష్టం సంభవించగా, 94.7 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు నష్టపోవడం జరిగింది. లక్షకు పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి. వాతావరణ మార్పు అనేది ఒకే ఒక్క విపత్తుగా కాకుండా, నిరంతర సంక్షోభంగా మారిందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఉష్ణోగ్రతలలో తేడా.. పెరిగిన వడగాలుల తీవ్రత...: దేశంలో ఉష్ణోగ్రతల పెరుగుదలతో వడగాలుల తీవ్రత గణనీయంగా పెరిగింది. వాతావరణ విభాగం గణాంకాలను పరిశీలిస్తే 2015లో కేవలం 9 రాష్ట్రాల్లో నమోదైన వడగాలులు, 2020 నాటికి 23 రాష్ట్రాలకు విస్తరించాయన్నది విధితమవుతుంది. దేశంలో వడగాలుల రోజులు 7.4 నుంచి 32.2కు పెరిగాయి. ప్రతి సంవత్సరం 1,000 మందికి పైగా వడగాలుల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. దేశంలోని సుమారు 57% జిల్లాలు తీవ్రమైన వేడి ప్రమాదంలో ఉన్నట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. తాజాగా శాస్త్రీయ విశ్లేషణలు కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మానవ శరీరం తట్టుకోలేని స్థాయికి చేరుతున్నాయని హెచ్చరిస్తున్నాయి. ఇది కేవలం పర్యావరణ సమస్య కాకుండా, ప్రజా ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా మారుతోంది.

వ్యవసాయ రంగం పై ప్రభావం...: వ్యవసాయం రంగం కూడా ఈ మార్పుల బారిన పడుతోంది. దేశ జనాభాలో 45% మంది వ్యవసాయంపై ఆధారపడుతున్నప్పటికీ, రుతుపవనాల అస్థిరత రైతులను తీవ్ర సంక్షోభంలోకి నెడుతోంది. వర్షపాతం విషయానికొస్తే సమయపాలన లోపించడం, అధిక వర్షాలు పంటల వైఫల్యానికి దారి తీస్తున్నాయి. 2026లో మాన్సూన్ సాధారణం కంటే సుమారు 94% స్థాయిలోనే ఉండే అవకాశమున్నట్లు అంచనాలు సూచిస్తున్నాయి. ఇక 40% జిల్లాల్లో వరద ప్రాంతాలు క్రమంగా కరవు ప్రాంతాలుగా మారుతున్నాయి. ఇలాగే కొనసాగితే దీర్ఘకాల కరవు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది. వేడెక్కుతున్న సముద్రాలు.. కరుగుతున్న హిమానీ నదాలు...: మన దేశం మూడు వైపులా ఉన్న సముద్రాలు వేడెక్కడం మరో ప్రధాన ఆందోళన. సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదలతో తుపానుల తీవ్రత పెరుగుతోంది. సముద్ర మట్టం పెరగడం వల్ల తీరప్రాంతాల్లో వరదలు అధికమవుతున్నాయి. 1995--2024 మధ్యకాలంలో ప్రపంచంలో అత్యధిక వాతావరణ ప్రభావిత దేశాల్లో భారత్ టాప్-10లో ఉండ టం ఈ ప్రమాదం స్థాయిని తెలియజేస్తోంది. మరోవైపున హిమాల యాల పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉంది. హిమనీనదాల కరుగుదల వేగవంతమవుతోంది. దీని ఫలితంగా నదుల ప్రవాహం అస్థిరంగా మారే ప్రమాదం ఉంది. భవిష్యత్తులో సాగునీటి కొరత, తాగునీటి సమస్యలు, వలసలు పెరగడం వంటి సమస్యలు తలెత్తే అవకాశముంది. ఇటీవల హిమాలయ ప్రాంతాల్లో కూడా వడగాలుల ప్రభావం కనిపించడం కొత్త హెచ్చరికగా భావించాలి.

ప్రజల అనుభవాల్లోనూ...: వాతావరణ మార్పు ప్రభావం కేవలం గణాంకాల్లోనే గాక ప్రజల అనుభవాల్లోనూ స్పష్టంగా కనిపిస్తోంది. కొన్ని సర్వేలు చెబుతున్నట్లు దేశంలో 71% మంది తీవ్ర వడగాలులను అనుభవించగా, 52% మంది నీటి కొరతను ఎదుర్కొంటున్నారు, అలాగే 34% మంది వరదలను చూశారు. వాతావరణ మార్పు ఇప్పుడు ప్రజల రోజువారీ జీవితాల్లో ప్రత్యక్ష వాస్తవంగా మారింది.

తక్షణ చర్యలు అవసరం...: ఈ మొత్తం దృశ్యం ఒకే సందేశాన్ని ఇస్తోంది. వాతావరణ మార్పు భవిష్యత్తు సమస్య కాదు; ఇది ఇప్పటికే దేశాన్ని ప్రభావితం చేస్తున్న సంక్షోభం. ఉష్ణోగ్రతల పెరుగుదల వెనుక ఆర్థిక నష్టం, ఆహార భద్రత సమస్యలు, ఆరోగ్య సంక్షోభం, సామాజిక అసమానతలు అన్నీ దాగి ఉన్నాయి.

# భూసేకరణలతో రైతుల గుండెల్లో రైళ్లు !



రాజధాని అమరావతికి ఇప్పటికే 32వేల ఎకరాలు సేకరించారు. మరో దశలో భూసేకరణకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటి వరకు సేకరించిన భూములకు సంబంధించి రైతులకు సరైన పరిహారం దక్కలేదు. ప్లాట్లు కూడా దక్కలేదు. కౌలు కూడా అరకొరగా అందచేస్తున్నారు. అయినా రైతులు రాజధాని కోసం సర్వస్వం త్యాగం చేశారు. మరిన్ని భూములు సేకరించే ప్రయత్నంలో కొంత వ్యతిరేకత తప్పడం లేదు. మూడు పంటలు పండే, కృష్ణా పరివాహక భూములు ఇవ్వడం సాధ్యం కాదని అంటున్నారు. రైతులకు మంచి ధరలు ఇచ్చి కొనడంలో కూడా సర్కార్ మీనమేషాలు లెక్కిస్తోంది. గతంలో ఇచ్చిన భూముల రైతులకు పెద్దగా దక్కింది కూడా లేదు. ఇప్పుడది చాలదన్నట్టు 65వ నెంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 189 కిలోమీటర్ల పొడవున 250 మీటర్ల వెడల్పుతో ఔటర్ రింగురోడ్డు ఒఆర్ఆర్ నిర్మాణం చేపట్టబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో గుంటూరు, ఎన్‌టిఆర్, పల్నాడు, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో ప్రభావిత ప్రాంతాల రైతులు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా పరిటాల నుండి ఇబ్రహీంపట్నం వరకూ కృష్ణానదికి సమీపంగా ఒఆర్ఆర్ నిర్మిస్తామంటూ అక్కడి భూయజమానులతో ఇటీవల అధికారులు చెప్పారు. దీంతో ఇప్పటికే మూడుసార్లు భూసేకరణ కింద భూమిని కోల్పోయామనీ, ప్రభుత్వానికి ఇంకెన్నిసార్లు భూములివ్వాలని రైతులు అభ్యంతరం తెలిపారు. మరోమారు భూసేకరణ పిడుగు పడడంతో వారు ఆందోళనలో ఉన్నారు. దేశంలో అనేక ముఖ్య నగరాల్లో ఒఆర్ఆర్, జాతీయ రహదారులు 70 మీటర్ల వెడల్పుతో నిర్మించగా అమరావతి రింగురోడ్డును 250 మీటర్ల వెడల్పుతో నిర్మించే ప్రతిపాదన సరికాదు. రైతుల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా కేంద్ర ప్రభుత్వ జాతీయ రహదారుల అథారిటీ (ఎన్‌హెచ్ఎఐ) డిపిఆర్ కూడా సిద్ధం చేసి, ముందుకు పోతుండడం రైతుల ప్రయోజనాలు దెబ్బతీయడమే. వారికి భూమికి భూమి ఇచ్చివుంటే సమస్యలు వచ్చి ఉండేవి కావు. రాజధాని నిర్మాణం, పట్టణాభివృద్ధి పేరిట రాష్ట్ర ప్రభుత్వం రైతులను తీవ్ర ఒత్తిళ్లకు గురిచేయడం సరైన పద్ధతికాదు. అమరావతి కోసం తొలి దశ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు డెవలప్ చేసిన ప్లాట్లు ఇప్పటికీ ఇవ్వలేదు. భూ యజమానులకు కౌలు, పేదలకు పింఛన్లు సరిగా అందడం లేదు. ఇబ్బందులిలా వుండగానే ఏలినవారు రెండవ దశ, అనంతరం మరింత విస్తరించడానికి భూములు సమీకరిస్తామని ఊరూరా తిరుగుతుంటే అన్నదాతల గుండెలు అదురుతున్నాయి. అదేపనిగా వేల ఎకరాలు సేకరించడం వెనక రియల్ మోసం ఉందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. తొలుత రాజధాని కోసం ప్రతిపాదించిన భూమితో సరిపెట్టుకోకుండా మరోమారు భూసేకరణకు దిగారు. ఇప్పుడు ఓఆర్ఆర్ ప్రతిపాదిస్తున్న మండలాలు, గ్రామాల పరిధిలో భూములు చాలా విలువైనవి. రైతులు, కూలీల జీవనం వాటిపైనే ఆధారపడి ఉంది. ఆ భూముల విలువ బహిరంగ మార్కెట్లో కోటి రూపాయల నుండి రెండుకోట్ల వరకూ ఉంటుంది. భూములు కోల్పోయే రైతులకు వ్యక్తిగతంగా నోటీసులు ఇవ్వకుండా కొన్ని గ్రామాల్లో సచివాలయాల ముందు భూముల సేకరణకు సంబంధించి సర్వే నెంబర్లు, ఎల్‌పి నెంబర్లు సేకరించే భూమి విస్తీర్ణం వంటి వివరాలతో నోటీసులు అతికించారు. ఇందులో ఏ రైతు భూమిని ఎంత విస్తీర్ణం ప్రభుత్వం సేకరించబోతోంది వంటి వివరాలు రైతుల వారీగా లేకపోవడంతో గందరగోళం నెలకొంది. ప్రభుత్వం పత్రికల్లో చేసిన ప్రకటన, సచివాలయాల్లో వేలాడదీసిన పత్రాలు పారదర్శకంగా లేకపోవడంతో రైతులు భయాందోళనల్లో ఉన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామసభలు జరిపి సామాజిక ప్రభావ అంచనా వివరించి రైతులు, ప్రజల సమ్మతి పొందడం అవసరం. అటువంటి చట్టబద్ధమైన ప్రక్రియ అమరావతి ఔటర్‌రింగు రోడ్డు ప్రతిపాదిత గ్రామాల్లో ఇప్పటి వరకూ ఎక్కడా చేపట్టకపోవడం ప్రభుత్వానికి తగదు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ఉన్న భూముల రేటుకు అనుగుణంగా ప్రభుత్వం పరిహారం ఇవ్వాలన్న రైతుల కోర్కె ఎంతో సమంజసమైనది. నయాయబద్ధమైనది కూడా. ఆ ప్రాంతం అభివృద్ధి చెందితే భూముల విలువలు ఎంతగానో పెరుగుతాయని భూ సమీకరణకు రైతులను అంగీకరింపజేయడా నికి చెప్పిన ఏలికలు ఆ రైతులకు ఇప్పటి మార్కెట్ విలువనైనా పరిహారంగా చెల్లించలేదు. ఆర్ఆర్‌లో భూమి కోల్పోతున్న ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన 71 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు.

# రేషన్ కార్డుల పునః పరిశీలన..!

తెలంగాణలో రేషన్ కార్డుల పునఃపరిశీలన ప్రక్రియ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. క్షేత్రస్థాయిలో అధికారులు చేపడుతున్న తనిఖీలు, ఆదాయ ప్రమాణాల ఆధారంగా అర్హతల పరిశీలన, ఇప్పటికే గణనీయ సంఖ్యలో కార్డుల తొలగింపు పరిణామాలు లబ్ధిదారుల్లో ఆసక్తితో పాటు ఆందోళనను కూడా కలిగిస్తున్నాయి. ముఖ్యంగా చిన్న వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులు, స్వయం ఉపాధి వర్గాల్లో అనిశ్చితి కనిపిస్తోంది. రేషన్ కార్డు వ్యవస్థ పేద మరియు తక్కువ ఆదాయం గల కుటుంబాలకు ఆహార భద్రతను అందించే కీలక సంక్షేమ పథకం. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 90 లక్షలకుపైగా కార్డులు అమలులో ఉన్నట్లు అంచనా. ఈ నేపథ్యంలో అర్హతల పునఃపరిశీలన ప్రక్రియ ప్రారంభమవడం సహజంగానే పెద్ద చర్చకు దారితీసింది. ప్రభుత్వం దృష్టిలో ఈ చర్యల ఉద్దేశం సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజంగా అర్హులకే చేరేలా చూడడం. డూప్లికేట్ ఎంట్రీలు, ఆదాయ మార్పులు, అనర్హ కార్డులను గుర్తించడం ద్వారా వ్యవస్థలో పారదర్శకత పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆదాయానికి సంబంధించిన సూచికలుగా ఐటీ రిటర్న్లు వంటి ఆధారాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు సమాచారం.



అయితే, ఐటీ రిటర్న్ దాఖలు చేయడం ఒక్కటే అధిక ఆదాయం ఉన్నదనే సూచిక కాదన్న వాదన వినిపిస్తోంది. బ్యాంకు రుణాలు, ఉద్యోగ అవసరాలు, పన్ను రీఫండ్ వంటి కారణాలతో తక్కువ ఆదాయం గల వ్యక్తులు కూడా రిటర్న్లు దాఖలు చేస్తుంటారు. కాబట్టి ఒకే ప్రమాణం ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటే కొన్ని సందర్భాల్లో నిజమైన అర్హులు జాబితా నుంచి తప్పిపోవచ్చన్న ఆందోళన వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిశీలన విధానంపై కూడా కొన్ని ప్రశ్నలు లేవుతున్నాయి. గ్రామ లేదా వార్డు స్థాయిలో అధికారులు డిక్లరేషన్లు తీసుకోవడం, ఆదాయాన్ని అంచనా వేయడం వంటి ప్రక్రియల్లో ప్రాంతానుసారంగా వ్యత్యాసాలు కనిపిస్తున్నాయనే అభిప్రాయాలు ఉన్నాయి. కొన్ని జిల్లాల్లో ఈ ప్రక్రియ వేగంగా కొనసాగుతుండటంతో ప్రజల్లో అనిశ్చితి పెరిగింది. ఇదే సమయంలో ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను కూడా చేపడతామని ప్రకటించింది. పాత కార్డుల పరిశుభ్రీకరణతో పాటు కొత్త అర్హుల చేర్పు---ఈ రెండు ప్రక్రియలు సమాంతరంగా కొనసాగుతున్నాయి. దీనివల్ల వ్యవస్థను సమతుల్యంగా మార్చే ప్రయత్నం జరుగుతోందని భావించవచ్చు.

సంక్షేమ పథకాల నిర్వహణలో మరో ముఖ్యమైన అంశం ఆర్థిక భారం. సబ్సిడీ వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో లీకేజీలను నియంత్రించడం ప్రభుత్వాల ముందున్న ప్రధాన సవాలు. ఈ దృష్టితో అర్హతల పునఃపరిశీలన అవసరమనే అభిప్రాయం కూడా ఉంది. అయితే, ఈ ప్రక్రియలో "ఎక్స్‌క్లూజన్ ఎరర్" అంటే అర్హుల తొలగింపు జరగకూడదన్నది నిపుణుల సూచన. ఇలాంటి సందర్భాల్లో కొన్ని జాగ్రత్తలు అవసరం. కార్డు రద్దు ముందు లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వడం, వివరణకు అవకాశం కల్పించడం, అప్పీల్ వ్యవస్థను అందుబాటులో ఉంచడం వంటి చర్యలు పారదర్శకతను పెంచుతాయి. అదేవిధంగా, అర్హతల నిర్ధారణలో ఆదాయం మాత్రమే కాకుండా జీవన ప్రమాణాలు, ఆస్తులు, సామాజిక పరిస్థితులు వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# ధరల పెంపుతో దేశంలో ప్రజల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం

## తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ




వరంగల్ జూన్ 9 (నమస్తే భారత్ ): అంతర్జాతీయ మార్కెట్ నెపంతో కేవలం ఒకే నెలలో పలుమార్లు ఇంధన ధరలను పెంచి ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపడం దుర్మార్గమని పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్, పెట్రోల్ మరియు డీజిల్ ధరలను వ్యతిరేకిస్తూ తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో గాంధీ భవన్ నుండి గన్ పార్క్ వరకు మహా నిరసన ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరలను ఏకంగా 4 సార్లు పెంచడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరంతరం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రజలపై ఈ విధంగా ధరల భారం మోపడం అత్యంత దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై విధించిన అధిక ఎక్సైజ్ డ్యూటీ వల్లనే ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ధరలు పెరగకుండా కేంద్ర ప్రభుత్వం ఎందుకు చమురు సంస్థలపై ఒత్తిడి తీసుకురావడం లేదు. ఎన్నికలకు ముందు ఒక మాటా, ఎన్నికలు అయిపోయాక ఇంకో మాటా ? ఇది కేంద్ర ప్రభుత్వ ద్వంద వైఖరికి నిదర్శనం. ఈ సుంకాన్ని వెంటనే తగ్గించి సామాన్యులకు ఊరట కలిగించాలి. అంతర్జాతీయ మార్కెట్ నెపంతో కేవలం ఒకే నెలలో పలుమార్లు ఇంధన ధరలను పెంచి ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపడం దుర్మార్గం. నాడు కాంగ్రెస్ హయాంలో గ్యాస్ ధర కొద్దిగా పెరిగితేనే రోడ్లపైకి వచ్చి నాటకాలు ఆడిన నాయకులు.. ఈరోజు ధరలు ఆకాశాన్ని తాకుతుంటే ఎక్కడ దాక్కున్నారు? అని నేను అడుగుతున్నాను. ఇంధన ధరలు పెరగడం అంటే కేవలం వాహనాల ఖర్చు పెరగడం కాదు.. నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పప్పులు, ఉప్పుల ధరలు కూడా అమాంతం పెరిగిపోవడం. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ప్రతి వస్తువుపై పన్నులు బాదుతూ, ధరలు పెంచుతూ ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నారు. కేంద్ర ప్రభుత్వానికి నేను ఒకటే హెచ్చరిక చేస్తున్నాను. సామాన్య మహిళల ఓట్లతో గద్దెనెక్కి.. అదే మహిళల వంటింటి బడ్జెట్‌ను అస్తవ్యస్తం చేసే హక్కు మీకు ఎవరు ఇచ్చారు? కార్పొరేట్ సంస్థల లాభాల కోసం ప్రజల రక్తాన్ని పిండుతుంటే చూస్తూ ఊరుకోవడానికి ఇక్కడ ఉన్నది చేతకాని వాళ్లు కాదు.. వీరు తెలంగాణ మహిళా కాంగ్రెస్ సింహాలు! మన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆత్మగౌరవాన్ని నిలబెడుతూ, 'మహాలక్ష్మి పథకం' ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ ఆదుకుంటుంటే.. కేంద్ర ప్రభుత్వం మాత్రం గ్యాస్, పెట్రోల్ ధరలు పెంచుతూ మహిళల నడ్డి విరుస్తోంది. గతంలో కాంగ్రెస్ హయాంలో సిలిండర్ ధర తక్కువగా ఉంటేనే నాడు నానా యాగి చేసిన బీజేపీ నాయకులు, ఇప్పుడు ధరలు వెయ్యి రూపాయలు దాటినా నోరు మెదపకపోవడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించి, బడా కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే పెంచిన ధరలను తగ్గించకపోతే మహిళల ఆధ్వర్యంలో దేశవ్యాప్త పోరాటాలు ఉధృతం చేస్తాం. మహిళా శక్తి ఏంటో కేంద్ర ప్రభుత్వానికి చూపిస్తామని ఎర్రబెల్లి స్వర్ణ హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర మహిళా కార్యవర్గ కమిటీ సభ్యులు, మహిళా కాంగ్రెస్ నాయకులు , మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతిభావంతులైన బాలలకు ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

## కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ జూన్ 9 (నమస్తే భారత్ ) : దేశ నిర్మాణంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన బాలలను గుర్తించి ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ -2026 కోసం నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ధైర్యసాహసం, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, కళలు-సంస్కృతి, విజ్ఞాన శాస్త్రం మరియు సాంకేతిక రంగాలలో అసాధారణ ప్రతిభ కనబరిచిన 18 సంవత్సరాల లోపు బాలలు ఈ పురస్కారానికి అర్హులని పేర్కొన్నారు. అర్హులైన బాలల ప్రతిభను జాతీయ స్థాయిలో గుర్తించి గౌరవించేందుకు ఈ అవార్డులుఅందజేయబడతాయని తెలిపారు. నామినేషన్లు రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించబడతాయని, అర్హులైన బాలల వివరాలను సంబంధిత అధికారులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలు గుర్తించి సిఫారసు చేయాలని కోరారు. బాలికలు, ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలు, దివ్యాంగులలోని ప్రతిభావంతులను ప్రత్యేకంగా గుర్తించి నామినేషన్లు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్-2026 నామినేషన్లకు జూలై 31, 2026 చివరి తేదీ కాగా, జిల్లా స్థాయిలో పరిశీలన కోసం సంబంధిత వివరాలను జూన్ 30, 2026లోగా కలెక్టర్ కార్యాలయానికి సమర్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు.

# జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ అమలుకు టీయూడబ్ల్యూజే వినతి

## మేడ్చల్ డీఈఓ రేణుకాదేవిని కలిసిన ప్రతినిధి బృందం -- 2026--27 విద్యా సంవత్సరానికి 50 శాతం రాయితీపై ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి

కుత్బుల్లాపూర్, జూన్ 9 ( నమస్తే భరత్ ); జర్నలిస్టుల పిల్లలకు పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే--ఐజేయు) మేడ్చల్ జిల్లా శాఖ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల ప్రతినిధి బృందం మంగళవారం జిల్లా విద్యాధికారి (డీఈఓ) రేణుకాదేవిని కలిసి వినతిపత్రం అందజేసింది. 2026--27 విద్యా సంవత్సరానికి జిల్లా పరిధిలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఈ రాయితీ వర్తించేలా స్పష్టమైన మార్గదర్శకాలు, ఉత్తర్వులు జారీ చేయాలని వారు కోరారు. జర్నలిస్టుల సంక్షేమంలో భాగంగా విద్యా భారం తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని టీయూడబ్ల్యూజే ప్రతినిధులు సూచించారు. ఈ వినతిపై డీఈఓ రేణుకాదేవి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. సంబంధిత అధికారులతో సమీక్షించి త్వరలోనే అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని ఆమె సూచించినట్లు తెలిసింది. అలాగే, వ్యక్తిగతంగా ఫీజు రాయితీ లెటర్లు అవసరమైన జర్నలిస్టులు జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని విద్యాశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో



టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజ్, జిల్లా కార్యదర్శి దొంతుల వెంకట్రాంరెడ్డి, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రవిచంద్ర, నాయకులు రామారావు, ప్రసాద్, భూపాల్, నరోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ డివిజన్‌లో తాగునీటి సమస్యపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

## - కాలనీలో పర్యటించి సమస్యలపై సమగ్ర చర్చ- త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి

కుత్బుల్లాపూర్, జూన్ 9 ( నమస్తే భరత్ ); 131 కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలో గత కొంతకాలంగా కొనసాగుతున్న తీవ్రమైన తాగునీటి సమస్యపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా వాటర్ వర్క్స్ విభాగం మేనేజర్ రవి, మేనేజర్ శివ ప్రసాద్, లైన్మెన్ అజీజ్ కాలనీలోని పలు ప్రాంతాలను సందర్శించి నీటి సరఫరా పరిస్థితిని పరిశీలించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, తాగునీటి సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాలు, పైప్‌లైన్ నిర్వహణలో ఉన్న ఇబ్బందులు తదితర అంశాలపై అధికారులు స్థానిక ప్రతినిధులు, ప్రజలతో చర్చించారు. సమస్య తీవ్రతను ప్రత్యక్షంగా గమనించిన అధికారులు సంబంధిత అంశాలను నమోదు చేసుకుని, పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక డివిజన్ బి.ఆర్.ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, నసీర్, వెంకటేష్, సురేష్ పాల్గొని కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నీటి కొరత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేక




కార్యాచరణ చేపట్టాలని వారు కోరారు. అధికారులు సమస్య పరిష్కారానికి అవసరమైన సాంకేతిక చర్యలను పరిశీలించి, ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానికులు కూడా అధికారుల పర్యటనపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, సమస్య త్వరితగతిన పరిష్కారమవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

# మెడికల్ కాలేజీకి నూతన ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్య



నర్సంపేట జూన్ 9 (నమస్తే భారత్ ) : నర్సంపేట పట్టణంలోని జిల్లా స్థాయి మెడికల్ కాలేజీకి నూతన ప్రిన్సిపల్ గా డా. సంధ్య నియమితులయ్యారు. మంగళవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి స్టాఫ్ ఏడీ సాజిద్ అలీ, ఆఫీస్ సూపరింటెండెంట్ , టీ. ఎన్.జీ.ఓ స్టేట్ ఈసీ మెంబర్ ఎండీ. మొయిజుద్దీన్ , ఆఫీస్ సూపరింటెండెంట్ రవీందర్ తదితరులు నూతన ప్రిన్సిపల్ కి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# అరవ బలిపశువు అయ్యారా?



కడప: రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారం వెనక కుట్ర జరిగిందన్న ప్రచారం జరుగుతుంది. అరవశ్రీధర్ చేసింది తప్పే. వివాహిత మహిళతో సంబంధాన్ని కొనసాగించడాన్ని ఎవరూ అంగీకరించరు. అలాగే మహిళ కూడా ఎమ్మెల్యే కావడంతో అరవ శ్రీధర్ అంటే ఇష్టపడి దగ్గరయ్యారు. అయితే వీరు విడిపోవడానికి అనేక కారణాలు వినిపిస్తున్నాయి. అరవ శ్రీధర్ వ్యవహారంపై లైంగిక వేధింపులు రావడంతో జనసేన పార్టీ వెంటనే త్రిసభ్య కమిటీని నియమించింది. నిన్న విచారణ కూడా పూర్తి చేసింది. నివేదిక ఏమిస్తుందన్నది చూడాలి. అయితే అరవ శ్రీధర్ వ్యవహారంలో కొత్త కోణం బయటపడుతుంది. ఎస్సీ యువకుడు కావడంతో కొందరు కావాలనే తమ పట్టు నుంచి జారి పోతారని భావించి ఇద్దరి మధ్య గ్యాప్ క్రియేట్ చేశారంటు న్నారు. జనసేన నేత, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పై పోలీసు కేసు కూడా నమోదయింది. ఓ మహిళా ఉద్యోగి లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడం సంచలనం కలిగించింది. మరొకవైపు అరవ శ్రీధర్ ను సదరు మహిళ పాతిక కోట్ల రూపాయలు డిమాండ్ చేసి బెదిరించిందని ఆరోపణలు కూడా వినిపించాయి. ఓ మహిళ మీడియా ముందుకు వచ్చి ఆరోపణలు చేసినా అరవ శ్రీధర్ పై కేసు నమోదు చేయలేదని విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఎట్టకేలకు అరవ శ్రీధర్ పై కేసు నమోదైంది.

# అర్హులైన ప్రతి ఒక్కరికి నెలకు రూ.4,000 పెన్షన్ అందించాలని డిమాండ్

## సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్




నమస్తే భారత్:-మరిపెడ ప్రజా సమస్యల పరిష్కారానికి జూన్ 10న మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయాలి -- సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్సిపిఐ మహబూబాబాద్ జిల్లా సమితి పిలుపు మేరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం జూన్ 10న మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే భారీ ధర్నాను ప్రజలు, రైతులు, కార్మికులు, మహిళలు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్ పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి నెలకు రూ.4,000 పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని రాజీలేకుండా అమలు చేసి అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని, పేదలకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి స్థలాలు కేటా యించాలని కోరారు. రైతులకు సంపూర్ణ రుణమాఫీ అమలు చేయడంతో పాటు కొనుగోలు చేసిన మొక్కజొన్న పంటకు సంబంధించిన బకాయి ులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీజిల్ రీయిం బర్స్‌మెంట్ బకాయిలను చెల్లించి పథకాన్ని కొనసాగించాలని, ప్రజా సంక్షేమపథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే చర్యలు చేపట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. ప్రజల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న జూన్ 10 ధర్నాలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎండి అబ్దుల్ రషీద్ కోరారు.

# గిరిజన ఉద్యమ నాయకుడు బిర్సా ముండా వర్ధంతి



మహబూబాబాద్ జూన్ 9 (నమస్తే భారత్ ): మహబూబాబాద్ పట్టణంలో బిర్సాముండా వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిలుగా హాజరైన కాంగ్రెస్ పార్టీ ఎస్ టీ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ గుగులోత్ వెంకట్ నాయక్,బహుజన రాజ్యాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ముంజాల రాజేందర్ గౌడ్ లు బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళీలు అర్పించారు. ఈసందర్భంగా వెంకట్ నాయక్ మాట్లాడుతూ గిరిజన ఉధ్యమా నాయకుడు బిర్స ముండా భారతదేశంలోని ప్రముఖ స్వతంత్ర పోరాటనాయకులు. ఆయన జార్ఖండ్ ప్రాంతంలోని ముండా తెగకు చెందినవారన్నారు. బ్రిటిష్ పాలనకు అలాగే స్థానిక జమీందారుల దోపిడీకి వ్యతిరేకంగా గిరిజనులను ఏకం చేసి ఉద్యమం నడిపిన మహా నాయకుడు అని కొనియాడారు. ఈ ఉద్యమాన్ని ఉల్గులాన్ అనగా మహా తిరుగుబాటు చేశాడు. గిరిజనుల భూమి హక్కుల కోసం పోరాటం చేసిన నాయకుడు ఆత్మగౌరవం స్వయం పాలన కోసం ఉద్యమం నడిపినటువంటి నాయకుడు. ఇతను చిన్న వయసులోనే అనగా 25 సంవత్సరాల వయసులోనే మరణించడం జరిగింది. బహుజన రాజ్యాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ముంజాల రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ వారు బహుజన నాయకత్వం,ప్రాముఖ్యతను వివరించారు. సమాజ అభివృద్ధి, ప్రజల సంక్షేమం మరియు యువత భాగస్వామ్యంపై, ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. బహుజన రాజ్యమే అంతిమ లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎస్టీ సెల్ టౌన్ అధ్యక్షుడు తేజావత్ శంకర్ నాయక్, ఎస్టీ సెల్ బోడ రాము టౌన్ వైస్ ప్రెసిడెంట్, అల్లి దుర్గేష్ టన్ ఓబీసీ అధ్యక్షులు, టౌన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్కే గఫూర్, బోడ శ్రావ్య నాయక్ ఆదివాసి నాయకులు, కొత్త యుగేందర్ ,బానోత్ బద్రమ్మ భూక్య రాధా, బోడ అలీ, పల్లి రాములు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సంఘ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రొయ్యల ధర పతనం



ఒంగోలు: ఒకపక్క రొయ్యల ధర పతనం అవుతుండగా, మరో పక్క రొయ్యల మేత ధర పెరుగుతోంది. దీంతో, రొయ్య రైతులకు చెంపదెబ్బ, గోడదెబ్బ తగిలినట్టయింది. రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో రొయ్యలు సాగవుతున్నాయి. ఏటా సీజన్‌లో 11 లక్షల టన్నుల దిగుబడి వస్తోంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలతోపాటు కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఎక్కువగా రొయ్యల సాగు ఉంది. తీరప్రాంతంలో పెద్ద ఎత్తున రొయ్యలను సాగు చేస్తున్నారు. 80 శాతం విదేశాలకు ఎగుమతులతో ఈ రంగం అంతర్జాతీయ వాణిజ్యంలో కీలకపాత్ర పోషిస్తోంది. ఈ నెల రెండో తేదీ వరకూ వంద కౌంట్ రొయ్యల ధర కిలో రూ.270 ఉండేది. ప్రస్తుతం ఈ ధర ఇప్పుడు రూ.250కు పడిపోయింది. మిగతా కౌంట్ల ధరలూ తగ్గాయి. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే రొయ్యల్లో 45 శాతం అమెరికాకు ఎగుమతి అయ్యేవి. మిగతావి యూరోపియన్ దేశాలకు పంపుతారు. రొయ్యలపై సుంకాలను 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్న అమెరికా ప్రకటించినా రొయ్యల ధర అదే రోజు పతనం కావడం పట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రొయ్యల మేతపై ప్రస్తుతం ఉన్న ఐదు శాతం దిగుమతి సుంకాన్ని 2.5 శాతానికి తగ్గించింది. మేత ధర తగ్గుందని రైతులు ఆశించగా, పెరగడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంపు గతంలో రొయ్యలపై సుంకాన్ని ఒక్కసారిగా 50 శాతం పెంచేశారు.

# మినరల్ కాదు.. జనరల్ మాత్రమే

ఆసిఫాబాద్ : జిల్లా కేంద్రమైన ఆసిఫాబాద్‌తో పాటు కాగజ్ నగర్ రెండు నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. "ప్యూరి పై వాటర్" వంటి పేర్లతో సాధారణ నీటిని మినరల్ వాటర్ అని ప్రజలకు సరఫరా చేసి మోసం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాంట్లను నిర్వహించినా, సంబంధిత అధికారులు దీనిపై పట్టించుకోవట్లేదు. జిల్లాలో దాదాపు 80కి పైగా మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నప్పటికీ, వాటిలో కొన్నింటికి మాత్రమే ఎస్ఎస్ఐ, ఐఎస్ఐ రిజిస్ట్రేషన్లు ఉన్నాయి. మిగతా ప్లాంట్లు రోజు వేల లీటర్ల నీటిని విక్రయించి లక్షల్లో ఆదాయం పొందుతున్నారు. ఈ నీటిని తాగిన వారికి అనేక ఆరోగ్య సమస్యలు రావడం సాధారణం అయింది.

మినరల్ మాటున దందా...: మినరల్ వాటర్ పేరుతో వాటర్ ప్లాంట్ యాజమాన్యాలు నీటిని శుద్ధి చేయకుండానే క్యాన్లలో నింపి లాభం పొందుతున్నారు. నీటిని నిల్వ చేసే ట్యాంక్‌లను నెలల తరబడి శుభ్రం చేయకపోవడం, నాణ్యతకు హానికరంగా మారింది. నీటిని శుద్ధి చేసిన తర్వాత నిబంధనల ప్రకారం క్యాన్ల పై తేదీ వివరాలను స్టిక్కర్ చేయాలి. కానీ ప్లాంట్ యాజమాన్యాలు ఈ నియమాన్ని పాటించడం లేదు. కనీసం ప్లాంట్ వద్ద అర్హత గల ల్యాబ్ టెక్నీషియన్ ఉండి, రోజూ నీటిని పరీక్షించి కాలుష్యం, మెగ్నీషియం మోతాదులు పరీక్షించిన తర్వాత మాత్రమే నీటిని సరఫరా చేయాలి. కానీ కొందరు అపరిశుభ్రమైన నల్లాల ద్వారా వచ్చే నీటిలో రసాయనాలు కలిపి, ప్రజల ఆరోగ్యంతో ఆటలు ఆడుతున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు...: వాటర్ ప్లాంట్లు ఐఎస్ఐ అనుమతి పొందాలంటే 1 లక్ష వరకు ప్రభుత్వానికి చెల్లించాలి. ప్రతి నెల పర్యవేక్షణ కొరకు 10,000, సంవత్సరానికి ఒక్కసారి రెన్యువల్ కోసం 50,000 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని చెల్లించకుండా, ప్లాంట్ నిర్వాహకులు సంబంధిత శాఖలోని కొంతమంది అధికారులకు ముడుపులు చెల్లించి, ఇష్టానుసారం నీటిని విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న వాటర్ ప్లాంట్లను సీజ్ చేసి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మామూలు మత్తులో పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక నాయకులు అధికారులు వాటర్ ప్లాంట్లను తనిఖీ చేసి, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్లాంట్లపై కఠిన చర్యలు తీసుకొని ప్రజల ఆరోగ్యాన్ని రక్షించాలని కోరుతున్నారు.

# స్మారక నాణేల సేకరణ హాబీగా..





ఒక్కొక్కరికి ఒక్కో అలవాటు ఉంటుంది. అది ప్రత్యేక హాబీగా రూపొందితే– ఆ వ్యక్తికి కూడా గుర్తింపు తెచ్చి పెడుతుంది. కొందరికి స్టాంపులు.. ఇంకొకరికి నాణేలు... మరికొందరికి అరుదైన వస్తువుల సేకరణ .. గార్డెనింగ్.. సూక్ష్మకళలు హాబీలుగా ఉంటాయి. అరుదైన స్మారక నాణేల సేకరణ హాబీగా పెట్టుకున్నారు కోడూరి నాగ సూర్య రాఘవేంద్రబాబు. అనేకమంది ప్రముఖుల స్మారకంగా విడుదల అయిన నాణేలను సేకరించారు. అవి చరిత్రను చెబుతాయి. ఆయా వ్యక్తుల ప్రాముఖ్యాన్ని వివరిస్తాయి. తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రు గ్రామానికి చెందిన కోడూరి ప్రసాద్, అన్నపూర్ణ దంపతుల కుమారుడు కోడూరి నాగ సూర్య రాఘవేంద్ర బాబు మే 26, 1999లో జన్మించారు. స్టాంపుల సేకరించిన ప్రముఖుల గురించి వార్తా పత్రికల్లో చూసి చిన్నప్పుడే తను కూడా ఏదో ఒకటి చేసి గుర్తింపు తెచ్చుకోవాలని భావించారు. అరుదైన నాణేలను సేకరించటంపై ఆసక్తి పెంచుకున్నాడు. తన పదో ఏట నుంచే దీనిని ప్రారంభించాడు. బిటెక్ తర్వాత ఎంబిఎ హెచ్ఆర్ విభాగంలో పూర్తిచేసిన ఆయన గత 15 సంవత్సరాలుగా స్టాంపులు, నాణేలు, అరుదైన వస్తువుల సేకరణ కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆయన వద్ద మనదేశానికి సంబంధించి ఆర్‌బిఐ ముద్రించిన పలు నాణేలు ఉన్నాయి. పాత నాణేలను సేకరించటం ఆయనకు ఫ్యాషన్. ఇప్పటివరకూ 200కుపైగానే కాయిన్స్ సేకరించి భద్రపర్చారు.

అరుదైనవి.. అలవోకగా...: మన దేశంలో మొదటిసారిగా మొఘల్ చక్రవర్తి అక్బర్ హయాంలో స్మారక నాణేలా విడుదల ప్రారంభమైంది. స్వాతంత్ర్యం అనంతరం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశస్థాయిలో ముఖ్యమైన సంఘటనలు, ప్రముఖ వ్యక్తులకు సంబంధించిన స్మారక కాయిన్స్ విడుదల చేస్తోంది. అలా విడుదల చేసిన వాటిలోనూ, తను సేకరించిన కాయిన్స్ ఉన్నాయి. వాటిలో జాతిపిత మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, సర్దార్ వల్లభారు పటేల్, తత్వవేత్త ఓషో పేరిట స్మారక నాణేలు ఉన్నాయి. 80 ఏళ్ల కామన్‌వెల్త్ గేమ్స్, ఇండియన్ రైల్వేస్, మదర్ థెరిస్సా, మదర్స్‌హెల్త్, రవీంద్రనాథ్ ఠాగూర్, సుప్రీంకోర్టు, మోతీలాల్ నెహ్రూ, మహారాణా ప్రతాప్, జగత్‌గురు నారాయణ, బయోడైవర్సిటీ, ఇన్‌కంటాక్స్, చైల్డ్‌హెల్త్, డైమండ్‌జూబ్లీ, 60 ఏళ్ల పార్లమెంట్, కూకామూవెంట్, బ్యాంక్ నగర (మలేషియా), ఆచార్య తులసి, బాబూ రాజేంద్రప్రసాద్, భగత్‌సింగ్, లూయిస్ బ్రెయిలీ, ఐఎల్ఒ, ఒఎన్‌జిసి, ఢిల్లీ కామన్‌వెల్త్‌గేమ్స్ వంటి అంశాలకు సంబంధించిన కాయిన్స్‌ను సేకరించారు. మనదేశంతోపాటుగా విదేశాలకు చెందిన కాయిన్స్‌ను కూడా కొన్నింటిని సేకరించారు.

భావితరాల కోసం...: ఉదయం నిద్ర లేచిన దగ్గర నుంచి ఫోన్ పే, గూగుల్‌పే, పేటీఎం అంటూ డిజిటల్ కరెన్సీకి అలవాటు పడిపోయాం. నాణేలు, కరెన్సీ వాడకం చాలావరకూ తగ్గిపోయింది. భావితరాలకు గతకాలపు నాటి నాణేలు గురించి తెలిసే అవకాశం చాలా తక్కువ. అందుకే భావితరాలకు తనవంతుగా కొంతమేరకైనా పరిజ్ఞానాన్ని పెంపొందించటానికి పురాతనకాలం నాటి అరుదైన నాణేలను సేకరించి భద్రపర్చటం, వాటిని ప్రదర్శించటం ద్వారా భావితరాలకు తెలియ జేయటానికి ఆయన కృషిచేస్తున్నారు. నాణేల రారాజుగా ఆయన్ను కొందరు పిలుస్తుంటారు. రాజుల కాలం నాటి నాణేలు, బ్రిటీషు వారు రూపొందించిన స్మారక చిహ్నాలు వంటివి కూడా కొన్ని ఉన్నాయి. మనం విడిచిపెట్టిన పైసలే కాదు, బేడ, దమ్మిడి, కాసులు ఆయన వద్ద భద్రంగా ఉన్నాయి. వివిధ సంవత్సరా ల్లో జారీ చేసిన స్వాతంత్ర్య సమరయోధుల నాణేలు ఆయన వద్ద అబ్బుర పరుస్తాయి. సిఎం నారా చంద్రబాబు నాయుడుతోపాటుగా పలువురు మంత్రులు, మాజీ మంత్రులు, కలెక్టర్లు ఇతడి కృషిని అభినందించారంటే ఆశ్చర్యం కలుగక మానదు. అనేక అరుదైన నాణేలను సేకరిస్తూ ఆయన పలువురి చేత శభాష్ అనిపించుకున్నారు.

పురాతన, చారిత్రక అంశాలు తెలిపేలా...: పురాతన, అరుదైన, విదేశీ నాణేలతో చరిత్ర, సంస్కృతిని తెలుసుకోవచ్చు. శతాబ్ధాలనాటి నాణేలతో ఆయా కాలాల గురించి కొంతైనా మననం చేసు కోవచ్చు. నిజాం, బ్రిటీష్ కాలం నాటి పైసలు, నాణేలు అరుదుగా దొరుకుతాయి. చాప్లిస్లపైనా మైక్రోఆర్ట్ చిత్రీకరణలు: నాణేల సేకరణ ఒక ఎత్తయితే వాటిని భద్రపర్చటం ఇంకో ఎత్తు. చాప్లిస్లపై పెన్సిళ్లతోనూ, పెన్నుతోనూ పలు ప్రభుత్వ పథకాలు గురించి రాసి సభలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాల సందర్భంగా ప్రముఖులకు అందజేయటం అతడికి అలవాటుగా మారింది. స్వాతంత్ర్య సమరయోధుల వర్ధంతులు, జయంతుల సందర్భంగా సభలకు హాజరయ్యే అతిథులను కలిసి అందజేస్తున్నారు. రాజమహేంద్రవరంలో ఇటీవల జరిగిన రిపబ్లిక్‌డే వేడుకల్లో ఆయన జిల్లాకలెక్టర్‌ను కలిసి చాప్లిస్‌పై రాసినది ఇచ్చారు. 2019లో అప్పటి సిఎం నారా చంద్రబాబు నాయుడు పేరును చాప్లిస్‌పై రాసి ఇవ్వగా ఆయన ఎంతో సంతోషించారు. పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా గతంలో అప్పటి జెఎన్‌టియు విసి మాజీ గొట్టుముక్కల ప్రసాద్ రాజుకు జాతీయజెండా ప్రతిరూపాన్ని తీర్చిదిద్ది ఇచ్చారు.

సామాజిక సేవల్లోనూ..: 2022లో ఆయనతోపాటుగా తీపర్రు గ్రామానికి చెందిన స్నేహితులు బాలాజీ, సత్యనారాయణ, వంశీ, సురేష్, సుభాష్‌లతో కలిసి అబ్దుల్ కలాం సేవా సమితిని ఏర్పాటుచేశారు. పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమాలతోపాటుగా గ్రామంలో స్వచ్ఛభారత్ వంటి కారక్రమాలను గ్రామస్తులతో కలిపి నిర్వహిస్తున్నారు. సమీపంలోని పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు పండుగలు, ప్రముఖ జాతీయ నాయకుల వర్ధంతులు, జయంతుల సందర్భంగానూ, స్వాతంత్ర్య దినోత్సవం, భారత రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా పిల్లలకు పండ్లు, పెన్సిళ్లు, స్కేళ్లు, అల్పాహారాలు వంటివి కూడా అందజేస్తున్నారు.

భావితరాల కోసమే...: భావితరాలకు మన కరెన్సీని విషయాలను అప్పటి చారిత్రక విషయాలను తెలియజేసేందుకు నేను కాయిన్స్ సేకరిస్తున్నా. సేకరించిన వాటిని ఎగ్జిబిషన్ల ద్వారా ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నా. కొన్నేళ్లుగా ఈ కృషిని కొనసాగిస్తున్నా. ఈ సేకరణతో నేటి తరానికి చరిత్రను తెలియజేస్తున్నాం. 2019లో సిఎం చంద్రబాబు నాయుడును కలిశాను. ఆయన అభినందించారు. నాకు మంచి భవిష్యత్తు చూపిస్తానని చెప్పారు.

# హెచ్ బీ కాలనీలో ఎల్ఐజీ, ఎంఐజీలు

హైదరాబాద్, : పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారం చేసే దిశగా తెలంగాణ సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది. హైదరాబాద్ శివారులో ఎల్ఐజీ, ఎంఐజీ( వర్గాలకు తక్కువ ధరలకే ఇళ్లను కట్టించి ఇవ్వడానికి ప్రణాళికలు రచిస్తోంది. అందుకు కావాల్సిన స్థలాలపై తాజాగా హౌసింగ్ బోర్డు దృష్టిసారించింది. ఈనెల 25 నుంచి ఏప్రిల్ 4 వరకు కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ(క్యూర్) పరిధిలోని హౌసింగ్ బోర్డు, దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్స్ స్థలాలను గుర్తించి వాటికి రక్షణ గోడలను నిర్మించాలని డిసైడ్ అయింది.

ఈ 11 రోజుల్లోనే ఆయా పేద, మధ్యతరగతి ప్రజలకు స్థల సేకరణ, ఇళ్ల నిర్మాణంపై డీపీఆర్ తయారీకి ప్రణాళిక రూపొందించనుంది. హౌసింగ్ బోర్డుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 5 నుంచి 14 వరకు కేటాయింపుదారులతో కాలనీల వారీగా అధికారులు సమావేశాలను నిర్వహిస్తారు. ఏప్రిల్ 15 నుంచి 23 వరకు గ్రీవెన్స్ కాల్ సెల్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు ప్రభుత్వం ఎఫర్డబుల్ హౌసింగ్ పాలసీని సిద్ధం చేస్తోంది. ఈ నెలాఖరులోగా మార్గదర్శకాల ముసాయిదాను సర్కార్ రూపొందించనుంది. పాలసీ రూపకల్పనకు 'రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్' ద్వారా ఇప్పటికే సీబీఆర్ఐ కన్సల్టెన్సీ సంస్థను సైతం ఎంపిక చేసింది. తెలంగాణ రైజింగ్ విజన్–2047లో భాగంగా పట్టణ ప్రాంతాల్లో పీపీపీ పద్ధతిలో పేదలు, మధ్యతరగతి వారికి ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి సర్కార్ ఏర్పాట్లు చేస్తోంది. మొత్తం మూడు దశల్లో ఈ ఇళ్ల సముదాయాలను నిర్మించనున్నట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ ఫోర్త్ సిటీలోనూ పెద్దఎత్తున గృహ సముదాయాల నిర్మాణాన్ని చేపట్టనుంది. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని ఇతర నగరాల్లోనూ తక్కువ ఆదాయ, మధ్య తరగతి పరిధిలోకి వచ్చే జనాభా ఎక్కువగా ఉంటున్నారు. వీరికి కూడా సొంత ఇల్లు కొనుక్కోవాలనే కోరిక ఉన్నప్పటికీ.. అక్కడ కూడా ధరలు భారీగా పెరిగిపోవడంతో అద్దె ఇళ్లలోనే నివాసం ఉంటున్నారు. అందుబాటు ధరలో ఇళ్లు, ఫ్లాట్ల ఉంటే వీరి సొంతింటి కలను నిజం చేసుకోవచ్చు. ఈ మేరకు టైర్ -2 పట్టణాల్లోనూ ఇళ్ల టవర్లను ఏర్పాటుచేసేలా సర్కార్ మార్గదర్శకాలను రెడీ చేస్తోంది. కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలో గృహనిర్మాణశాఖ స్థలాలను ఇప్పటికే గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో ఇళ్ల సముదాయాలు నిర్మించి అల్ప ఆదాయ, మధ్యతరగతి వారికి తక్కువ ధరలకే అందించాలని సర్కార్ ప్రయత్నాలు చేస్తోంది

# భారీగా సోలార్ ఉత్పత్తికి సింగరేణి ప్రణాళికలు

అదిలాబాద్, : పర్యావరణహిత గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా సింగరేణి సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. కార్మికుల నివాస గృహాలపై రూఫ్ టాప్ సౌర ఫలకాలను ఏర్పాటు చేయాలని డిసైడ్ అయింది. ఈ మేరకు సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. సుమారు రూ. 65 కోట్ల వ్యయంతో 15 వేల కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల సంస్థపై ప్రతి నెలా పడుతున్న రూ. 50-60 కోట్ల విద్యుత్ బిల్లుల భారం కొంత మేర తగ్గనుంది. సింగరేణి సంస్థ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా సింగరేణి ఏరియాల్లోని కార్మికుల నివాస గృహాలపై సోలార్ ప్యానళు ఏర్పాటు చేసి విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం అనువైన నివాస గృహాలను గుర్తించేందుకు ఆరు నెలల క్రితమే సింగరేణి అధికారులు సర్వే నిర్వహించారు. ఎక్కడైతే చెట్లు, నీళ్ల ట్యాంకులు లేకుండా ఖాళీగా నివాస గృహాలు ఉన్నాయో.. వాటిపై ఈ ప్యానళ్లు ఏర్పాటు చేసి సోలార్ విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు



సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా సింగరేణి యాజమాన్యం గతేడాది డిసెంబర్‌లో ఓ సంస్థతో అగ్రిమెంట్ సైతం కుదుర్చుకుంది. పదేళ్లపాటు ఈ సంస్థనే కార్మికుల ఇళ్లపై సోలార్ నిర్వహణ బాధ్యత చేపట్టనుంది. సింగరేణి క్వార్టర్లలో కార్మికుల గృహ విద్యుత్తు వినియోగానికి ప్రస్తుతం నెలకు సుమారుగా రూ. 50 నుంచి 60 కోట్ల మేర చెల్లిస్తోంది. రూఫ్ టాప్ సౌర విద్యుత్తుతో సింగరేణికి ఆ భారం చాలా వరకు తగ్గనుంది. అన్ని ఏరియాల వ్యాప్తంగా 15 వేల కిలోవాట్ల మేర సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయాలని సంస్థ టార్గెట్‌గా పెట్టుకుంది. ఇందు కోసం రూ. 65 కోట్ల ఖర్చు చేయనుంది. ఉద్యోగుల గృహాలకు వినియోగించగా మిగిలిన మొత్తాన్ని గ్రిడ్‌కి అనుసంధానించనున్నారు. ఈ మేరకు 800 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తే లక్ష్యంగా ఇప్పటికే పలు ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఈ ప్లా?ంట్ల ద్వారా ప్రస్తుతానికి 500 మెగావాట్ల వరకు లక్ష్యాన్ని సాధించింది. రూఫ్‌టాప్ సౌర విద్యుత్తు పనులు త్వరలో ప్రారంభం అవుతాయని మణుగూరు వర్క్‌షాపు డీజీఎం శ్రీకాంత్ తెలిపారు. సౌర ఫలకలు ఏర్పాటు చేసేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామని అన్నారు. కాగా, సింగరేణి సంస్థ చేపట్టిన ఈ రూఫ్ టాప్ సౌర విద్యుత్ ప్రాజెక్టు వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా.. ప్రతి నెలా కార్మికుల గృహ విద్యుత్ వినియోగం కోసం సంస్థ వెచ్చిస్తున్న రూ. 50 నుంచి 60 కోట్ల భారం గణనీయంగా తగ్గుతుందని చెబుతున్నారు. 15 వేల కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా సంస్థకు దీర్ఘకాలికంగా ఆర్థిక పొదుపు చేకూరుతుందని అంటున్నారు. పర్యావరణ పరంగా చూస్తే.. బొగ్గు ఆధారిత విద్యుత్తుపై ఆధారపడటం తగ్గి, కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని..ఇది గ్రీన్ ఎనర్జీ లక్ష్యానికి దోహదపడుతుందని వెల్లడిస్తున్నారు. గృహ అవసరాలకు పోగా మిగిలిన విద్యుత్తును గ్రిడ్‌కు అనుసంధానించడం ద్వారా అదనపు శక్తి వనరుగా మారుతుందని చెబుతున్నారు. ఇది సంస్థ ఆర్థికాభివృద్ధికే కాకుండా.. సింగరేణిని పర్యావరణ హితమైన తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తుందని అంటున్నారు.



# ప్రపంచాన్ని కుదిపేస్తున్న ఎప్‌స్టీన్ ఫైల్స్

జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారులు, రాజకీయ నాయకులు, దేశాల అధ్యక్షులు, కంపెనీల అధినేతలు వణికిపోతున్నారు. ఎప్‌స్టీన్ కేసు మళ్లీ ప్రపంచాన్ని కుదిపేస్తోంది. గతంలోనే అంతర్జాతీయంగా పెద్ద చర్చకు దారితీసిన ఈ వ్యవహారం.. ఇప్పుడు కొత్తగా వెలుగులోకి వస్తున్న ఫైల్స్‌తో మరోసారి ప్రభావం చూపుతోంది. ప్రముఖ వ్యాపార, విద్యా, రాజకీయ రంగాలకు చెందిన వ్యక్తుల పేర్లు బయటకు రావడం, ఆ తర్వాత రాజీనామాల పరంపర మొదలవడం.. ఇది సాధారణ పరిణామం కాదు. ప్రపంచ స్థాయి సంస్థల విశ్వసనీయత, నైతిక ప్రమాణాలపై గంభీరమైన ప్రశ్నలను లేవనెత్తే పరిణామంగా ఇది మారింది. ఈ సందర్భంలో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూ ఈ ఎఫ్) సీఈవో బోర్జ్ బ్రెండే రాజీనామా అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రపంచ ఆర్థిక విధానాలను ప్రభావితం చేసే ప్రముఖ వేదికకు నాయకత్వం వహిస్తున్న వ్యక్తి.. ఇలాంటి ఆరోపణల నడుమ తప్పుకోవడం సంస్థపై నేరుగా ప్రభావం చూపే అంశం. అమెరికా న్యాయ శాఖ విడుదల చేసిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బ్రెండే పేరు ప్రస్తావించబడడం.. ఆయన ఎప్‌స్టీన్‌తో భేటీ అయినట్లు ఆధారాలు బయటపడడం ఈ పరిణామానికి కారణమయ్యాయి. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలోనే ఆయన రాజీనామా చేయడం.. నైతిక బాధ్యతగా భావించవచ్చు. అయితే తన రాజీనామా లేఖలో ఈ అంశాన్ని నేరుగా ప్రస్తావించకపోవడం సందేహాలకు తావిస్తోంది. ఇది కేవలం ఒక వ్యక్తి రాజీనామా కథ కాదు. హార్వర్డ్ మాజీ అధ్యక్షుడు లారెన్స్ సమ్మర్స్, నోబెల్ గ్రహీత రిచర్డ్ ఆక్సెల్, గోల్డ్‌మన్ శాక్స్ లీగల్ ఆఫీసర్ క్యాథీ రూమ్లెర్, హయత్ హోటల్స్ వారసుడు థామస్ ప్రిట్‌జ్కర్, డీపీ వరల్డ్ చైర్మన్ సుల్తాన్ అహ్మద్ , నార్వే అంబాసిడర్ మోనా వంటి ప్రముఖులు కూడా ఈ వివాదంతో తమ పదవులను వదులుకోవడం.. ఈ వ్యవహారం ఎంత విస్తృతంగా ఉందో తెలియజేస్తోంది. వ్యాపార దిగ్గజాలు, విద్యావేత్తలు, ప్రభుత్వ అధికారుల వరకు విస్తరించిన ఈ సంబంధాల నెట్‌వర్క్, అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకు కారణమవుతోంద ఈ పరిణామాల వల్ల ప్రధానంగా మూడు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. మొదటిది ప్రపంచ ఎలైట్ వర్గాల మధ్య ఉన్న సంబంధాల స్వభావం. రెండవది నైతిక బాధ్యత అనే అంశం. మూడవది సంస్థల పారదర్శకతపై ఉన్న నమ్మకం. ఎవరైనా చట్టపరంగా తప్పు చేశారనే విషయం నిరూపించబడకపోయినా.. ప్రజా విశ్వాసాన్ని కాపాడుకోవడానికి నాయకులు రాజీనామా చేయాల్సిన పరిస్థితి రావడం.. నేటి ప్రపంచంలో నైతిక ప్రమాణాలు ఎంత కీలకమో చూపిస్తోంది. ప్రత్యేకంగా వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వంటి సంస్థల విషయంలో ఈ అంశం మరింత ప్రాముఖ్యం సంతరించుకుంటుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకునే వేదికగా ఉన్న ఈ సంస్థపై ప్రజలకు నమ్మకం ఉండాలి. అందుకే ఏ చిన్న వివాదం కూడా పెద్ద ప్రభావం చూపే అవకాశం ఉంది. బ్రెండే స్థానంలో తాత్కాలికంగా అలోయిస్ జ్వింగీ బాధ్యతలు చేపట్టడం, సంస్థ కొనసాగింపుకు అవసరమైన చర్యగా కనిపిస్తున్నా, దీర్ఘకాలికంగా సంస్థ ప్రతిష్టను పునరుద్ధరించడం పెద్ద సవాలుగా మారింది. అదే సమయంలో ఈ ఫైల్స్ విడుదలలో పారదర్శకత ఎంత వరకు ఉందనే ప్రశ్న కూడా లేవనెత్తబడుతోంది. దర్యాప్తు వివరాలు పూర్తిగా బయటకు రాకపోవడం.. సమాచారం గోప్యంగా ఉంచడం ఇవి మరోవైపు అనుమానాలను పెంచే అంశాలు. ప్రజలకు పూర్తి నిజాలు తెలియజేయకపోతే, ఊహాగానాలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. మొత్తం మీద ఎప్‌స్టీన్ ఫైల్స్ వ్యవహారం ఒక వ్యక్తి లేదా కొన్ని రాజీనామాలకే పరిమితం కాదు. ఇది ప్రపంచ ఎలైట్ వ్యవస్థలో ఉన్న బలహీనతలను బహిర్గతం చేస్తున్న సంఘటనగా చూడాలి. సంస్థల విశ్వసనీయత, నాయకుల నైతిక బాధ్యత, పారదర్శకత ఈ మూడు అంశాలు భవిష్యత్తులో మరింత కఠినంగా పరీక్షించబడే అవకాశం ఉంది. ఈ పరిణామాలు గ్లోబల్ స్థాయిలో పరిపాలనా విధానాలపై, నాయకత్వ ప్రమాణాలపై కొత్త చర్చలకు దారి తీస్తున్నాయి. ఎప్పుడు ఎవరి బాగోతం బయట పడుతుందో అర్థం కాని పరిస్థితి. ఇప్పటికే మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ ఇప్పటికే తప్పు అంగీకరించాడు. ఇక డొనాల్డ్ ట్రంప్ కూడా ఇందులో ఉన్నాడు. అయితే తాజాగా బయటపడిన ఈ ఫైల్స్ కారణంగా పలు కంపెనీల దిగ్గజాలు కూడా ఉన్నారు. వీరు రాజీనామా బాట పడుతున్నారు. తాజాగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సీఈవో బోర్జ్ బ్రెండే తన పదవికి రాజీనామా చేశారు, దవోస్ సమ్మిట్‌ల సంస్థకు ఇది భారీ దెబ్బ. హార్వర్డ్ యూనివర్సిటీ మాజీ అధ్యక్షుడు లారెన్స్ సమ్మర్స్, నోబెల్ బహుమతి విజేత రిచర్డ్ ఆక్సెల్ కూడా బాధ్యతల నుంచి వైదొలిగారు. ఈ ముగ్గురూ ఎప్‌స్టీన్ ఈవెంట్స్‌లో పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వాల్ స్ట్రీట్ జెయింట్ గోల్డ్‌మన్ సాక్స్‌లో చట్టపరమైన విభాగం హెడ్ క్యాథీ రూమ్లెర్, హయాత్ హోటల్స్ వారసుడు థామస్ ప్రిట్‌జ్కర్ తమ స్థానాలు వదులుకున్నారు. గ్లోబల్ పోర్ట్ ఆపరేటర్ డీపీ వరల్డ్ చైర్మన్ సుల్తాన్ అహ్మద్ బిన్ సులాయెం, నార్వే అంబాసిడర్ మోనా జుహానీ కూడా రాజీనామా చేశారు. ఈ లిస్ట్ రోజుకొకకొనసాగుతోంది, ఫైనాన్షియల్ మార్కెట్లలో అనిశ్చితి పెరుగుతోంది. ఎప్‌స్టీన్ డాక్యుమెంట్స్‌లో 170+ ప్రముఖుల పేర్లు వచ్చాయి. ఇందులో పొలిటీషియన్లు, బిజినెస్ టైకూన్లు, సైంటిస్టులు ఉన్నారు. ఈ ఆరోపణలు సెక్సువల్ ట్రాఫికింగ్, ఇన్‌ఫ్లుయెన్స్ ఫెడ్లింగ్‌కు సంబంధించినవి. ఫైనల్ కోర్ట్ ఆర్డర్‌తో ఈ ఫైల్స్ పబ్లిక్ డొమైన్‌లోకి వచ్చాయి, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ రాజీనామాలు ఎంమనీనీ ఉద్యమం తర్వాత ఎలైట్ అకౌంటబిలిటీకి కొత్త ఎపాక్‌ను ప్రారంభిస్తున్నాయి. డబ్ల్యూఈఎఫ్ విశ్వసనీయత క్షీణించడంతో గ్లోబల్ పాలసీ చర్చలు ప్రభావితమవుతాయి. హార్వర్డ్‌లో నాయకత్వ షేకప్ విద్యా రంగంలో పరిణామాలకు దారితీస్తుంది. ఫైనాన్షియల్ రంగంలో గోల్డ్‌మన్ సాక్స్ షేర్లు 5 శాతం పడిపోయాయి, మార్కెట్ అనిశ్చితి పెరిగింది.

# సామాన్యుడిపై ముప్పేట దాడి



- ఫిబ్రవరిలో ద్రవ్యోల్బణం పంజా
- ఆహార వస్తువుల ధరలు పైపైకి
- పల్లెల్లోనే భారం అధికం

న్యూఢిల్లీ : అధిక ధరలతో దేశంలో సామాన్యుడి వంటింటి బడ్జెట్ తలకిందులవుతోంది. ఇప్పటికే నిత్యావసరాల ధరలతో సతమతమవుతున్న ప్రజలపై ద్రవ్యోల్బణం మరోసారి పంజా విసిరింది. ప్రభుత్వం విడుదల చేసిన రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. జనవరిలో 2.74 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం.. కేవలం నెల రోజుల్లోనే 3.21 శాతానికి ఎగబాకింది. ఈ ధరలు సామాన్యుడి జేబుకు చిల్లు పెడుతున్నాయి.

అమెరికా యుద్ధోన్మాద చర్యలతో పశ్చిమాసియాలోని ఉద్రిక్తతలు భవిష్యత్తులో ధరలకు మరింత ఆజ్యం పోయనున్నాయని రిపోర్టులు వస్తోన్నాయి. ముఖ్యంగా ఆహార వస్తువుల ధరలు సామాన్యులను బెంబేలెత్తిస్తు న్నాయి. జనవరిలో 2.13 శాతంగా ఉన్న ఆహార ద్రవ్యోల్బణం.. ఫిబ్రవరిలో ఏకంగా 3.47 శాతానికి చేరడం ఆందోళనకరం. కేవలం నెల రోజుల్లోనే 47 బేసిస్ పాయింట్ల మేర భారం పెరిగింది. టమోటా 45.29 శాతం, కాలీఫ్లవర్ 43.77 శాతం చొప్పున ఎగిసిన కూరగాయల ధరలు చుక్కలను చూపిస్తున్నాయి. వెండి ఆభరణాలపై ఏకంగా 160.84 శాతం ద్రవ్యోల్బణం నమోదు కావడం గమనార్హం.

పల్లెల్లోనేధరల కష్టం..: నగరాల కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే ధరల ఒత్తిడి ఎక్కువగా ఉండటం ఆందోళనకర అంశం. ఫిబ్రవరిలో పట్టణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 3.02 శాతంగా ఉంటే, గ్రామీణ ప్రాంతాల్లో అది 3.37 శాతానికి చేరింది. మౌలిక వసతులు, రవాణా ఖర్చులు పెరగడంతో గ్రామాల్లోని నిరుపేదలు, మధ్యతరగతి వర్గాలపై ఈ ప్రభావం తీవ్రంగా పడుతోంది.

తెలంగాణలో రెట్టింపు..: దేశంలోని పెద్ద రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో మరింత ఎక్కువ ద్రవ్యోల్బణం చోటు చేసుకుంది. జాతీయ సగటు 3.21 శాతంకంటే.. తెలంగాణలో ఏకంగా 5.02 శాతం ద్రవ్యోల్బణం నమోదయ్యింది. అంటే దేశవ్యాప్తంగా ధరల పెరుగుదల ఒకలా ఉంటే.. తెలంగాణలో అది రెట్టింపు స్థాయిలో ఉంది. రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కూడా తెలంగాణ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ప్రభుత్వాలు ధరలను అదుపు చేయడంలో విఫలమైతే, సామాన్యుడి పరిస్థితి మరింత దయనీయంగా మారే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

ముంచుకొస్తున్న గ్యాస్ దడ..: ఇప్పటికే ద్రవ్యోల్బణం సెగతో అల్లాడుతున్న భారత్‌కు గ్యాస్ కొరత మరింత దడ పుట్టిస్తుంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో దేశవ్యాప్తంగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత తీవ్రమయ్యిందని బ్లూమ్‌బెర్గ్ నివేదిక హెచ్చరించింది. ఈ పరిణామం రానున్న రోజుల్లో ద్రవ్యోల్బణం మరింత పెరగడానికి ప్రధాన కారణం కానుందని హెచ్చరించింది. గ్యాస్ కొరతతో బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేయడంతో సాధారణంగా రూ.1,750 ఉండే కమర్షియల్ సిలిండర్ ధర ఇప్పుడు రూ.2,000 దాటేసింది. కొందరు వ్యాపారులు రూ.3,000 చెల్లిస్తోన్నారు. దీనివల్ల చిన్న హోటళ్లలో సాధారణ భోజనం ధరలు ఇప్పటికే 10 శాతం మేర పెరిగాయి. మరింత పెరగొచ్చని అంచనా. మార్చి నెలలో గ్యాస్, చమురు ధరల అస్థిరత దీనిని మరింత పైకి తీసుకెళ్లే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. యుద్ధం సుదీర్ఘ కాలం కొనసాగితే భారత్‌లో ధరల నియంత్రణ ఆర్‌బిఐకి అత్యంత సవాలుగా మారనుందని హెచ్చరిస్తున్నారు.

# రష్యా నుంచి చమురు కొనుగోళ్లు..

**భారత్‌కు అనుమతించిన అమెరికా వాణిజ్య శాఖ**
**ఇందన సంక్షోభానికి తెరదించే యత్నంగా వెల్లడి**



వాషింగ్టన్, : ఇరాన్ - ఇజ్రాయెల్, అమెరికాల ఉద్రిక్తతల నేపథ్యంలో తీవ్ర ఇంధన సంక్షోభం ఎదుర్కొంటున్న వేళ ప్రపంచ దేశాలకు కాస్త ఉపశమనం లభించింది. రష్యా చమురు కొనుగోలుకు స్వల్పకాలికంగా అనుమతినిస్తూ అమెరికా ఉత్తర్వులు జారీ చేసింది. సముద్రంలో నిలిచిపోయిన చమురును కొనుగోలు చేసేందుకు ఏప్రిల్ 11 వరకు అవకాశం కల్పించింది. ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లో నెలకొన్న అనిశ్చితిని తొలగించేందుకు అమెరికా ఈ నిర్ణయం తీసుకుంది. మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడికి భారంగా మారుతున్న తరుణంలో గ్లోబల్ ఎనర్జీ మార్కెట్‌లో స్థిరత్వాన్ని తీసుకు రావడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్టు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 'ప్రపంచ ఇంధన మార్కెట్‌లో స్థిరత్వాన్ని పెంపొందించడం, ధరలను అదుపులో ఉంచేందుకే ట్రంప్ ఈ నిర్ణయాత్మక చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతానికి సముద్రంలో నిలిచిపోయిన చమురు రవాణాకు మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయి' అని బెసెంట్ స్పష్టం చేశారు. రష్యాపై ఆంక్షలు అమల్లో ఉన్నప్పటి కీ అమెరికా తాత్కాలిక సడలింపులతో పుతిన్ ప్రభుత్వానికి పెద్దగా ఆర్థిక ప్రయోజనం ఉండదని బెసెంట్ అన్నారు. రష్యాకు వచ్చే ఆదాయంలో అధిక భాగం చమురు వెలికితీసే సమయంలోనే పన్నుల రూపంలో అందుతుందని, ఇప్పుడు రవాణాలో ఉన్న చమురు అమ్మకం వల్ల వారికి అదనపు ప్రయోజనమేమీ ఉండదని ఆయన వివరించారు. ఈ నిర్ణయం వల్ల స్వల్పకాలికంగా ధరలు పెరిగినా.. దీర్ఘకాలంలో అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఇది ఎంతో మేలుచేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అయితే.. తాజా సడలింపులతో మార్చి 12 నాటికి నౌకల్లో లోడ్ అయిన రష్యా ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులను ఏప్రిల్ 11 వరకు విక్రయించుకోవచ్చు. గతంలో అమెరికా ఆంక్షలు విధించిన రష్యన్ సంస్థల నుంచి ఉత్పత్తైన చమురును కూడా ఇప్పుడు కొనుగోలు చేసుకోవచ్చు. ఇకపోతే ప్రపంచ దేశాల్లో ఇంధన సంక్షోభం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో భారత్‌కు ఇరాన్ ఉపశమనం కలిగించింది. భారతీయ ట్యాంకర్లను హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లేందుకు అనుమతించింది. భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రమణ్యం జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మధ్య జరిగిన చర్చల అనంతరం.. భారత జెండాలు కలిగిన నౌకలకు టెహ్రాన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు పలు మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ పరిణామంతో అమెరికా, ఇజ్రాయెల్, ఐరోపా దేశాలకు చెందిన నౌకలు ఆంక్షలు ఎదుర్కొంటున్నప్పటికీ.. పుష్పక్, పరిమళ్ అనే రెండు భారతీయ ట్యాంకర్లు వ్యూహాత్మకంగా హోర్ముజ్ జలసంధిని దాటినట్టు పేర్కొన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ ప్రయోజనాలకు సంబంధంలేని నౌకలకు మాత్రం ఆంక్షల నుంచి సడలింపునిచ్చింది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రారంభమైన తర్వాత తొలిసారిగా భారతీయ నౌకలు జలమార్గం గుండా సురక్షితంగా ప్రయాణించడం విశేషం.

# తొలి ఎఐ క్యాంపస్ కాలేజీగా బిట్స్ పిలాని

- మంత్రి లోకేశ్‌తో బిట్స్ ప్రతినిధుల భేటీ
- క్యాంపస్ నిర్మాణ ప్లాన్‌లపై చర్చ
- వేయికోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడి






అమరావతి: రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న బిట్స్ పిలానీ దేశంలోనే మొదటి ఏఐ క్యాంపస్‌గా ఉండబోతోందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు ఆ సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు. అధునాతన సాంకేతికతో పాటు వ్యవసాయం నుంచి వాతావరణం, ఆరోగ్య సంరక్షణ వంటి కోర్సులు సైతం ఇక్కడ ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి లోకేశ్‌కు వారు వివరించారు. ఉండవల్లిలోని మంత్రి లోకేశ్ నివాసంలో ఆయనతో బిట్స్ పిలానీ ప్రతినిధులు సమావేశమయ్యారు. బిట్స్ పిలానీ నిర్మాణ ప్లాన్లను మంత్రి నారా లోకేశ్ పరిశీలించారు. బిట్స్ పిలానీ ప్రతినిధులు లోకేశ్‌ను కలిసి ప్లాన్లు చూపించారు. క్యాంపస్‌లో ఏఐ, డేటా సైన్స్, రోబోటిక్స్, కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ కోర్సులు ఉంటాయని ప్రతినిధులు వివరించారు. రెండు దశల్లో 7 వేల మందికి అవకాశం కల్పించేలా నిర్మాణాలు ఉంటాయన్నారు. క్యాంపస్‌పై ఐదేళ్లలో రూ.1000 కోట్లు పెట్టుబడి పెడతామని ప్రతినిధులు మంత్రికి తెలిపారు. 'నెక్స్ట్ జెన్ టెక్నాలజీలతో క్యాంపస్ నిర్మిస్తున్నాం. గ్రీన్ బిల్డింగ్, రెన్యువబుల్ ఎనర్జీ విధానాలు పాటిస్తున్నాం. ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అమరావతి బిట్స్.. దేశంలోనే మొదటి ఏఐ క్యాంపస్ కానుంది. వ్యవసాయం, వాతావరణం, ఆరోగ్యం సంరక్షణ కోర్సులు ఉంటాయి' అని బిట్స్ ప్రతినిధులు లోకేశ్‌కు వివరించారు. సాధ్యమైనంత త్వరగా క్యాంపస్ ప్రారంభించేలా చూడాలని లోకేశ్ సూచించారు.

ఈ సందర్భంగా బిట్స్ చేపట్టిన నిర్మాణ ప్లాన్లను లోకేశ్ పరిశీలించి.. సంతృప్తి వ్యక్తం చేశారు. సాధ్యమైనంత త్వరగా అమరావతి క్యాంపస్ ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని వారిని మంత్రి లోకేశ్ కోరారు. బిట్స్ పిలానీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఏఐ, డేటా సైన్స్, రోబోటిక్స్, కంప్యూటే షనల్ లింగ్విస్టిక్స్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ తదితర కోర్సులు అమరావతి క్యాంపస్‌లోఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రెండు దశల్లో 7 వేల మంది విద్యార్థులకు అవకాశం కల్పించేలా అమరావతి బిట్స్ పిలాని నిర్మాణాలను చేపడుతున్నామని చెప్పారు.

ఈ క్యాంపస్‌పై వచ్చే ఐదేళ్లలో రూ. 1000కోట్ల పెట్టుబడి పెడతామనివారు ఈ సందర్భంగా వివరించారు. అలాగే సీఎం చంద్రబాబు నాయుడు దార్శనికతకు అను గుణంగా నెక్స్ట్ జెన్ టెక్నాలజీలతో ఈ క్యాంపస్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ నిర్మాణంలో గ్రీన్ బిల్డింగ్, రెన్యువబుల్ ఎనర్జీ వంటి పర్యావరణ హిత విధానాలను పాటిస్తున్నామని తెలిపారు. బిట్స్ ప్రతినిధులు సిద్దార్థ బెనర్జీ, ఎన్. చెన్నవీర్, బీఎస్ సహాని తదితరులు మంత్రి లోకేశ్‌ను కలిసిన వారిలో ఉన్నారు. అనంతరం మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిపి. నారాయణతో బిట్స్ పిలానీ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగాఅమరావతి క్యాంపస్‌లో నిర్మించే భవనాల డిజైన్లను మంత్రి నారాయణకు వారు వివరించారు. రెండున్న రేళ్లలో మొదటి దశ అడ్మిషన్లకు సిద్ధం చేస్తామని ఈ సందర్భంగా మంత్రికి బిట్స్ ప్రతినిధులు తెలిపారు. మందడం, వెంకటపాలెం మధ్య సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన 70 ఎకరాల్లో బిట్స్ క్యాంపస్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. మూడు దశల్లో ౦ఎ? క్యాంపస్‌గా బిర్లా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థ నిర్మాణం చేపట్టింది.

## భారీ జీఎస్టీ కుంభకోణం బట్టబయలు!

### రూ.84.15 కోట్ల మోసం జరిగినట్లు గుర్తింపు..!

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రవాణిజ్య పన్నుల శాఖ భారీ జీఎస్టీ కుంభకోణాన్ని బయటపెట్టింది. సుమారు రూ.84.15 కోట్ల విలువైన ఐటీసీ మోసం జరిగినట్లు గుర్తించింది. ప్రధాన నిందితుడు, ఎస్‌కేజీ ట్రేడింగ్ కంపెనీ ప్రొప్రైటర్ సందీప్‌ను అధికారులు అరెస్టు చేశారు. నిందితుడు నకిలీ ఇన్వాయిస్‌ల ద్వారా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందినట్లు గుర్తించారు. సందీప్‌కు సంబంధమున్న ఇతర సంస్థల్లోనూ అక్రమాలు జరిగినట్లు తేలింది. ఈక్రమంలో వాటి రిజిస్ట్రేషన్లను అధికారులు రద్దు చేశారు. సందీప్‌ను జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.

## కృష్ణానదిలో ఆగని అక్రమ ఇసుక రవాణా.. టిప్పర్లను వదిలి ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు

మాగనూరు : నారాయణపేట జిల్లా కృష్ణ మండలం పరిధిలోని కృష్ణా నదిలో నిత్యం రాత్రి వేళలో అక్రమ ఇసుక రవాణా అడ్డు అదుపు లేకుండా పోతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. బుడ్డ బల్లూరి శివారులో ఉన్న ఓంకార మఠం, వాసు నగర్, ముడుమాల్, గురుజాల్, గ్రామాల సమీపం నుంచి భారీ సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా నదిలో రోడ్లు వేసి హిటాచీల ద్వారా టిప్పర్లలో ఇసుక నింపి కర్ణాటకలోని సైదాపూర్, యాదగిరి, గుల్బర్గాకు ఇసుకను అక్రమంగా తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపిస్తున్నారు.

సంబంధిత శాఖల అధికారులకు ముడుపులు ముట్టడం వల్లే పట్టించుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. రాత్రి ముడుమాల్ కృష్ణా నదిలో అక్రమ ఇసుక రవాణాపై కృష్ణ ఎస్సై సిబ్బందితో దాడులు నిర్వహించి మూడు ట్రాక్టర్లను పట్టుకుని, టిప్పర్లను వదిలేశారని సర్వత్రా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై ఎస్సై నవీద్ ను వివరణ కోరగా క్వారీ ప్రాంతాల్లో టిప్పర్లు ఏమి లేవని, నాలుగు ట్రాక్టర్లు మాత్రమే దొరికాయని, ట్రాక్టర్ల నెంబర్ల ఆధారంగా కేసులు నమోదు చేశామని వివరించారు.

# గుడ్డుకు గడ్డుకాలం

- యుద్ధ ప్రభావంతో ఆగిన ఎగుమతులు
- పడిపోయిన ధర
- కిలో చికెన్‌కు నాలుగు గుడ్లు ఉచితం



చిత్తూరు : గల్ఫ్ దేశాల్లో యుద్ధ ప్రభావం కోడిగుడ్ల ధరలపై పడింది. ఏడాది ప్రారంభంలో ఒక గుడ్డు ధర ఎనిమిది రూపాయలు ఉంటే ప్రస్తుతం సగానికి సగం పడిపోయింది. యుద్ధ ప్రభావంతో ఎగుమతులు ఆగిపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని పౌల్ట్రీ నిర్వాహకులు పేర్కొన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కోడిగుడ్ల ధర మరింత పతనమవుతుందని చెబుతున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో కోడిగుడ్లు ఎగుమతుల్లో తమిళనాడు రాష్ట్రం నమక్కల్ మొదటి స్థానం, చిత్తూరు జిల్లా రెండో స్థానంలో ఉంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చిత్తూరు, బంగారుపాళ్యం, తవణంపల్లి, పలమనేరు, పూతలపట్టు, పుత్తూరు ప్రాంతాల్లో పౌల్ట్రీలు పెద్దమొత్తంలో ఉన్నాయి. 12 నుంచి 15 భారీ పౌల్ట్రీలు ఉన్నాయి. 1500 మంది కుటీర పరిశ్రమగా నిర్వహిస్తున్నారు.

మొదట్లో కోళ్ల పరిశ్రమ కాస్త ఆశాజనకంగా ఉన్నా కాలానుగుణంగా వచ్చిన నష్టాలతో అనేక కోళ్ల ఫారాలు మూతపడ్డాయి. ప్రస్తుతం బాయిలర్, లేయర్స్ (గుడ్లు పెట్టే కోళ్లు) ఫారాలు 1500 ఉన్నాయి. సరాసరిన రోజుకు ఐదు నుంచి ఆరు లక్షల కోడిగుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. చిత్తూరు జిల్లా నుంచి ప్రతిరోజు లక్షకు పైగా కోడిగుడ్లు చెన్నై పోర్టు నుంచి ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. గల్ఫ్‌యుద్ధ ప్రభావంతో గత నెల 27 నుంచి 12 దేశాలకు ఎగుమతి అవుతున్న కోడిగుడ్లు నిలిచిపోయాయి. దీంతో స్థానికంగా కోడిగుడ్లను విక్రయించుకోవాల్సిన పరిస్థితి రావడంతో గుడ్ల ధర ఒక్కసారిగా పతనమైనట్లు నేషనల్ ఎగ్ కో- ఆర్డినేషన్ కమిటీ జిల్లా నాయకత్వం పేర్కొంది. ఒక గుడ్డు ఉత్పత్తి చేసేందుకు పౌల్ట్రీ ఫారం రైతు రూ.5 నుంచి 5.50 వరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని, గుడ్డు ధర ప్రస్తుతం నాలుగు రూపాయలు పలకడంతో పౌల్ట్రీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ధర మరింత పతనమై తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంటామని పౌల్ట్రీ రైతులు ఆందోళన చెందుతున్నారు. 60 రోజులకు మించి కోడిగుడ్లను శీతల గిడ్డంగుల్లో పెట్టుకునే అవకాశం లేదు. గుడ్డు ధర పతనం కావడంతో చికెన్ సెంటర్ నిర్వాహకులు కిలో చికెన్‌కు నాలుగు గుడ్లు ఉచితంగా అందిస్తున్నారు. పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలని నేషనల్ ఎగ్ కో- ఆర్డినేషన్ కమిటీ, పౌల్ట్రీ రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. నమక్కల్‌లో ఎగుమతులు ఎక్కువగా ఉండటం వల్ల ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు దిగుమతులు చేయడం వల్ల ఆయా ప్రాంతాల్లో ధరలు పతనమయ్యాయని నెక్ అసోసియేషన్ జాతీయ నాయకులు రమేష్ తెలిపారు.

# వంటగ్యాస్ కొరతపై హోటల్స్ యజమానుల ఆందోళన

**ఆర్థిక మంత్రి పయ్యావులతో కలసి చర్చలు**
**ఆంక్షలతో హోటల్స్ నడిపేందుకు సిద్ధమని వెల్లడి**
**నిర్ణయం తీసుకుంటామన్న మంత్రి**



అమరావతి: రాష్ట్రంలో వంటగ్యాస్ కొరత తీవ్రమవుతున్న నేపథ్యంలో విజయవాడ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అమరావతిలోని సచివాలయంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిశారు. గ్యాస్ కొరత కారణంగా హోటల్ పరిశ్రమ ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన పలు కీలక చర్యలపై చర్చించారు. విజయవాడ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమణ ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్యాస్ పొదుపు కోసం తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొంటూ పలు ప్రతిపాదనలు మంత్రి ముందు ఉంచారు. గ్యాస్ వినియోగాన్ని తగ్గించేందుకు హోటళ్ల పనివేళలను కుదించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి హోటళ్లకు సెలవు దినంగా ప్రకటిస్తే గ్యాస్ పొదుపునకు అవకాశం ఉంటుందని సూచించారు. రెస్టారెంట్లలో లభించే మెనూను కుదించాలని, అలాగే ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ వ్యాపారాన్ని నియంత్రించడం ద్వారా గ్యాస్ వినియోగాన్ని అదుపు చేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం రెస్టారెంట్లకు కేవలం 75శాతం మాత్రమే గ్యాస్ సరఫరా జరుగుతోందని, హోటళ్లకు ఇచ్చే కోటా గ్యాస్ మరో రెండు రోజుల్లో పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏప్గీ ÷వ్ స్టార్ హోటల్స్ ప్రెసిడెంట్ స్వామి మాట్లాడుతూ,్గ ÷వ్ స్టార్ హోటళ్లకు మరో 5 నెలల వరకు సరిపడా అఔఉ గ్యాస్ కనెక్షన్ ఉందని తెలిపారు. అయితే, సాధారణ హోటళ్లు మూతపడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. హోటల్ యజమానుల సమస్యలను విన్న మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందించారు. అన్ని హోటళ్లు ఒకేసారి కాకుండా, ప్రాంతాల వారీగా షెడ్యూల్ ప్రకారం తెరిచి ఉంచేలా ఆలోచన చేయాలని మంత్రి సూచించారు.

గ్యాస్ కొరతపై చర్చించేందుకు తర్వాత మంత్రుల కమిటీ సమావేశం కానుందని, ఆ రోజు హోటల్ అసోసియేషన్ ప్రతినిధులను కూడా పిలిచి చర్చించి కీలక నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. బర్నర్ల వినియోగం తగ్గించడం, ఇతర పొదుపు చర్యలపై ప్రభుత్వం త్వరలోనే స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయనుందని మంత్రి పేర్కొన్నారు.కాగా, వంటగ్యాస్ కొరత ప్రభావం సామాన్యులతో పాటు హోటల్ పరిశ్రమపై తీవ్రంగా పడుతోంది. ప్రభుత్వం తీసుకునే 'నిర్ణయం' రాష్ట్రంలోని వేలమంది హోటల్ కార్మికులు, వినియోగదారులపై ప్రభావం చూపనుంది.

# దిక్కుతోచని శనగ, మక్కరైతులు



## కొనుగోలు కేంద్రాలు లేక ఆందోళన

## ఉన్నతాధికారులకు నివేదించామన్న మార్క్‌ఫెడ్

నిజామాబాద్: జిల్లాలో శనగ, మక్క రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు పండించినా కొనుగోలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడ్డికి పావుసేరు అన్నట్లుగా ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. అయితే ఈ సమస్యలపై అధికారుల నుంచి స్పష్టమైన హామీలు రావడం లేదు. శనగ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఉన్నతాధికారులకు నివేదికను అందజేశామని మార్క్‌ఫెడ్ డీఎం శశిధర్ అన్నారు. ఎన్‌సీసీ వారి నుంచి అనుమతులు రాగానే కేంద్రాలు ఏర్పాటు చేసి శనగలు కొనుగోలు చేస్తామని చెప్పారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే మద్దతు ధర రూ. 5,875 లభిస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్న రైతులకు నిరాశ తప్పడంలేదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో గత్యంతరం లేక పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు, కుటుంబ అవసరాల కోసం దళారులకు రూ. 4,900 నుంచి రూ. 5,300 వరకు విక్రయించి నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనగ పంట సాగు చేయడానికి పెట్టుబడి ఖర్చు ఎక్కువ కావడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో దిగుబడి తక్కువగా వచ్చి సుమారు ఎకరానికి రూ. 5,600 ఖర్చయినట్లు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర లేక నష్టపోతున్నామని వాపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్‌లో వ్యాపారులు తక్కువ ధర అంటే రూ. 5,100లకే అడుగుతున్నారు. ముందుగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై పంటను సేకరించి ఉంటే ఇబ్బందులు వచ్చేవి కావని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎవరూ పట్టించుకోవడం లేదు. తక్కువ ధరకే అమ్మి రైతులు నష్టపోతున్నారు. పంట కోతకు వచ్చే సమయంలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే రైతులు పంటలు అమ్ముకోగలరని అంటున్నారు. దీంతో రైతులకు శనగ విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు రాజ్యమేలుతున్నారు. రైతులు నిల్వ సౌకర్యం లేక, చేసిన అప్పుల ఒత్తిడితో పంటను అమ్ముకోవాల్సి వస్తున్నది. రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుని దళారులు తక్కువ ధరకే శనగలు కొనుగోలు చేసి, సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అక్కడ ఎక్కువ ధరకు విక్రయించి లాభాలు గడిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

# రికార్డుల ర్యాపిడో... రోజుకు 10 లక్షల రైడ్లు




హైదరాబాద్ : భారతదేశంలో అతిపెద్ద, అందుబాటు ధరల మొబిలిటీ ప్లాట్‌ఫామ్‌గా ఎదిగిన ర్యాపిడో ఇప్పుడు హైదరాబాద్ నగరంలో మెట్రో ప్రయాణాలకు కీలక భాగస్వామిగా మారుతోంది. నగరంలో ప్రయాణించే ప్రజలు తమ రోజువారీ ప్రయాణాలను సులభంగా పూర్తి చేసుకునేందుకు రాపిడో మొదటి మైలు, చివరి మైలు ప్రయాణాలను కలిపే ముఖ్యమైన సేవగా నిలుస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో రోజుకు సుమారు 1.5 లక్షలకుపైగా రాపిడో రైడ్లు మెట్రో స్టేషన్లతో అనుసంధానమై జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ప్రయాణికులు తమ ఇంటి నుండి మెట్రో స్టేషన్‌కు చేరుకోవడానికి లేదా మెట్రో స్టేషన్ నుంచి తమ గమ్యస్థానానికి చేరుకోవడానికి రాపిడో బైక్‌లు, ఆటోలను విస్తృతంగా వినియోగిస్తున్నా రని తేలింది. అంతేకాకుండా, రాపిడో యాప్ ద్వారా రోజుకు దాదాపు 30,000 మెట్రో టికెట్లు బుక్ అవుతున్నాయి. ఇది నగరంలో సమగ్ర పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్‌పై ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తిని చూపిస్తోంది. రాపిడో కేవలం ఒక యాప్ మాత్రమే కాదు, హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థలో ఒక కీలక భాగమైపోయింది. రాపిడో సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి మాట్లాడుతూ, నగర రవాణా వ్యవస్థ సజావుగా పనిచేయాలంటే ప్రయాణం సులభంగా, నిరంతరంగా ఉండాలని తెలిపారు. హైదరాబాద్‌లో ప్రయాణికులు మెట్రో ప్రయాణాన్ని రాపిడో బైక్‌లు, ఆటోలతో కలిపి వేగంగా, సమయపాలనతో ప్రయాణిస్తున్నారని చెప్పారు. ఒకే ప్లాట్‌ఫామ్ ద్వారా బహుళ రవాణా విధానాలను సులభంగా వినియోగించుకునేలా చేయడం తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో మొత్తం కలిపి రోజుకు 10 లక్షలకు పైగా రాపిడో రైడ్లు నమోదవుతున్నాయట. దీంతో నగర పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ నెట్‌వర్క్‌కు మద్దతు ఇస్తున్న ప్రముఖ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో రాపిడో ఒకటిగా నిలుస్తోంది. ప్రయాణికులకు సౌకర్యం, సమయ ఆదా ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. ఇకపై ప్రయాణాన్ని ప్లాన్ చేయడానికి వేర్వేరు యాప్‌లను ఉపయోగించాల్సిన అవసరం లేకుండా, ఒకే యాప్‌లో టికెట్ బుకింగ్‌తో పాటు రైడ్ సదుపాయం అందుబాటులో ఉండటం మెట్రో ప్రయాణాన్ని మరింత అలవాటుగా మారుస్తోంది. దీనికి అనుగుణంగా రోజువారీ వినియోగ ధోరణులు కూడా మారుతున్నాయి. హైదరాబాద్‌లో జరిగే మొత్తం రాపిడో రైడ్లలో దాదాపు సగం రైడ్లు కార్యాలయాలు, కళాశాలల పీక్ అవర్స్‌లోనే జరుగుతున్నాయి. ఇది రాపిడో సేవలు సాధారణ రవాణా కంటే రోజువారీ ప్రయాణానికి అవసరమైన మౌలిక వసతులుగా మారుతు న్నాయని సూచిస్తోంది. భవిష్యత్తులో హైదరాబాద్ మెట్రో విస్తరిస్తున్న నేపథ్యంలో రాపిడో నగరంలోని ఇళ్లు, వీధులు, మెట్రో స్టేషన్లను కలిపే కీలక కనెక్టివిటీ లేయర్‌గా మరింత ప్రాధాన్యం పొందే అవకాశముంది.

# మెజారిటీ మంత్రులకు ఉద్వాసన..

## ఈ ఐదుగురికే ఛాన్స్..

విజయవాడ: రాజకీయాలు అన్నాక రకరకాల రూమర్లు వస్తుంటాయి. ముఖ్యంగా సర్వే సంస్థలు కొన్ని అంచనాలు వెల్లడిస్తుంటాయి.. అయితే అలా ఫలితాలు విడుదల చేసిన సర్వే సంస్థల విశ్వసనీయత బట్టి అవి ఆధారపడి ఉంటాయి. నమ్మాలా వద్దా అనేది ఎదుటి వ్యక్తి నమ్మకం బట్టి ఉంటుంది. అయితే తాజాగా సర్వేలు నిర్వహించే రైజ్ సంస్థ నిర్వాహకుడు ప్రవీణ్ పుల్లట రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉగాదికి కానీ.. తరువాత కానీ మంత్రివర్గ విస్తరణ ఖాయమని చెబుతున్నారు. రాష్ట్ర మంత్రివర్గంలోకి ఓ ఐదుగురిని తీసుకోవడం ఖాయమని చెప్పుకొస్తున్నారు. ఆయన పేరుతో సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు. విపరీతంగా వైరల్ అవుతుంది. 2024 జూన్ 4న ఫలితాలు వచ్చాయి. అదే నెల 12న ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, ఓ 24 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ఒక మంత్రి పదవిని ఖాళీగా ఉంచారు. పవన్ కళ్యాణ్ కీలకమైన నాలుగు శాఖలకు మంత్రి బాధ్యతలు తీసుకోవడంతో పాటు డిప్యూటీ సీఎం హోదా కూడా తీసుకున్నారు.. అయితే ఖాళీగా ఉన్న మంత్రి పదవి ఎమ్మెల్సీ నాగబాబుతో భర్తీ చేయనున్నారు. అదే సమయంలో కొత్తగా ఓ ఐదుగురిని మంత్రివర్గంలోకి తీసుకోనున్నారు. ప్రవీణ్ పుల్లట ఇదే విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ బెందాళం అశోక్, పల్లా శ్రీనివాస్, కొణతాల రామకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, వేమిరెడ్డి లను రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారని డాక్టర్ ప్రవీణ్ పుల్లట వెల్లడించారు. ఇందులో శ్రీకాకుళం జిల్లాకు చెందిన బెందా ళం అశోక్ ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు గెలిచారు. సౌమ్యుడుగా పేరు ఉంది. ఈసారి ఆయనకు చాన్స్ ఇస్తారని తెలుస్తోంది. ఒకవైపు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటారని సమాచారం. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిచారు శ్రీనివాస్. మంత్రివర్గంలోకి తీసుకుంటారని భావించిన చివరి నిమిషంలో రాష్ట్ర అధ్యక్ష పదవి అప్పగించారు. విస్తరణలో ఆయనకు తప్పకుండా ఛాన్స్ ఇస్తారని ప్రవీణ్ పుల్లట చెబుతున్నారు. అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు సైతం ఛాన్స్ ఉండనుంది. ఇప్పటికీ ఆయన సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందారు. గతంలో మంత్రి పదవి చేపట్టారు. మరోవైపు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు ఛాన్స్ ఇస్తారని చెబుతున్నారు. ఆయన చంద్రబాబుతో పాటు లోకేష్ కు సన్నిహితుడు. పార్టీకి విలువైన సేవలు అందించారు. మరోవైపు నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి ఛాన్స్ తప్పకుండా దక్కుతుందని చెబుతున్నారు. ఆమె భర్త వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు. ఎన్నికలకు ముందు తన భార్యతో కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. తెలుగుదేశం పార్టీలో చేరారు. అప్పట్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు ఆమెను మంత్రివర్గంలోకి తీసుకుంటారని ప్రవీణ్ పుల్లట చెప్పుకొస్తున్నారు. గతంలో ఎన్నికలకు ముందు టిడిపి కూటమికి అనుకూలమైన ఫలితాలు ఇచ్చారు ప్రవీణ్ పుల్లట. అవి నిజమని తేలాయి. అందుకే ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి ఆయన మాటలు.

# ఆస్పత్రులలో ఏఐ సాయంతో వైద్య సేవలు




గుంటూరు: ఏపీ ప్రభుత్వం ఏఐ సాయంతో వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. 18 ప్రభుత్వాసుపత్రుల్లో సుమారు 40 పరికరాల ద్వారా పైలట్ ప్రాజెక్టు కింద సరికొత్త ఆవిష్కరణల ద్వారా వైద్య సేవల్లో కీలకమైన స్క్రీనింగ్, కన్ఫర్మేషన్ పరీక్షలు చేస్తున్నారు. ఈ మేరకు తక్కువ సమయంలో వ్యాధులు ఖరారు చేయడం, అత్యుత్తమ వైద్యం అందిచొచ్చని చెబుతున్నారు అధికారులు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏఐ సేవల్ని అందుబాటులోకి తీసుకురావాని నిర్ణయిం చారు. రాష్ట్రవ్యాప్తంగా 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో 18 స్టార్టప్ సంస్థలతో కలిసి వైద్య పరీక్షలు, ఇతర సేవల్ని ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏఐ సేవలతో అతి తక్కువ సమయంలో వ్యాధి నిర్ధారణ, రోగులకు చికిత్స అందించే సమయం కూడా ఆదా అవుతుందంటున్నారు. విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రులు.. పార్వతీపురం, రాజానగరం, సిద్ధార్థ మెడికల్ కాలేజీ, సత్తెనపల్లి ప్రాంతీయ ఆసుపత్రి, తెనాలిలోని జిల్లా ఆస్పత్రి, ఇతర చోట్ల పైలట్ ప్రాజెక్టు విధానంలో ఈ సేవల్ని ప్రారంభించారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ ద్వారా వీటి ఫలితాలను విశ్లేషించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదక ఇస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. వ్యాధుల్ని ప్రాథమిక పరీక్షలతో గుర్తించి.. తక్కువ సమయంలో మెరుగైన వైద్యసేవలు అందించొచ్చు. డాక్టర్లు, పేషెంట్ల మధ్య సంభాషణ రికార్డు చేస్తారు ఏఐ అప్లికేషన్ల సాయంతో పరీక్షలు చేసి ప్రాథమిక దశలోనే సమస్యల్ని గుర్తిస్తున్నారు. ఆయా ఆస్పత్రుల్లో క్యాన్సర్ గుర్తింపు, క్షయను గుర్తించడానికి, షుగర్, కిడ్నీ, థైరాయిడ్, రక్తపరీక్షలు కూడా ఏఐ ఆధారిత పరికరాలతో చేస్తున్నారు. గుండె సమస్యలు, ఐసీయూలో ఉన్నవారికి బీపీ, పల్స్, టెంపరేచర్, ఆరోగ్య పరిస్థితి పర్యవేక్షణ లాంటి మరికొన్ని చోట్లో అందుబాటులో ఉన్నాయి. ఏఐ సాయంతో ఏపీ ప్రభుత్వం వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు మంత్రి సత్యకుమార్. రాష్ట్రంలో ఎంపిక చేసిన 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒకేసారి 40 పరికరాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. విశాఖపట్నంలో 'పింక్ సఖి శారీ వాక్' నిర్వహిం చారు.. క్యాన్సర్‌పై అవగాహన కలిగించడానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ వాక్‌ను రాహుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు బీచ్ రోడ్డులో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ వాక్‌కు సినీ నటి, లైఫ్ ఎగైన్ సంస్థ వ్యవస్థాపకు రాలు గౌతమి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే ఈ అవగాహన ర్యాలీలో నగరానికి చెందిన మహిళలు భారీగా పాల్గొన్నారు.

# ఆవును చంపిన పెద్ద పులి



రాజవొమ్మంగి (అల్లూరి) : మండలంలోని మారేడుబాక పంచాయితీ జి.శరభవరం గ్రామ సమీప అటవీ ప్రాంతంలో ఆవుపై పెద్దపులి దాడి చేసి హతమార్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .... మంగళవారం తెల్లవారుజామున జి.శరభవరం గ్రామ సమీపంలో కోసురి వీధికి చెందిన గణపతి అనే మహిళకు చెందిన ఆవుపై పులి దాడి చేసింది. ఆవు మెడ భాగంలో తీవ్ర రక్తస్రావంతో కూడిన గాయమైంది. ఆ సమయంలో అలజడి ఉండడంతో పులి ఆవును వదిలి వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. పెద్ద పులి కదలికలు ఈ ప్రాంతంలో ఉన్న నేపథ్యంలో అటవీశాఖ సబ్ డీఎఫ్ఓ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రాజవొమ్మంగి రేంజర్ ఉషారాణి, ఫారెస్ట్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. పులి దాడి చేసి హతమార్చిన ఆవును, ఆ ప్రాంతాన్ని సబ్ డి ఎఫ్ ఓ సుబ్బారెడ్డి ఫారెస్ట్ సిబ్బంది ఈరోజు పరిశీలించారు. పులి పాదముద్రలను గుర్తించారు. పోలవరం జిల్లాలో భయం పుట్టిస్తున్న పెద్దపులి బోనులో చిక్కకుండా హల్ చల్ చేస్తూనే ఉంది. రాజవొమ్మంగి మండలం మారేడుబాక మండలం జీ.శరభవరం గ్రామం పరిసరాల్లో నేడు పులి కదలికలు రికార్డ్ అయ్యాయని సుబ్బారెడ్డి తెలిపారు. 2 రోజులుగా ఆకలితో ఉన్న పులి మూగ జీవాలను మట్టుబెట్టే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని పరిసర ప్రాంతాల వారిని అధికారులు హెచ్చరిస్తున్నారు. సిబ్బంది సమీపంలోనే ఉన్నారని తెలిపారు. మారేడుబాక పంచాయితీ కోసూరి వారి వీధి గ్రామ పరిధిలోని పొలాల్లో ఉన్న పశువుపై సోమవారం రాత్రి పెద్దపులి దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. పులిని బంధించేందుకు అడ్డతీగల సబ్ డివిజన్ డీఎఫ్ఓ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నాగార్జునసాగర్ నుంచి వచ్చిన ప్రత్యేక శిక్షణ పొందిన బఅందం అటవీశాఖ సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. పెద్దపులి కదలికలను గుర్తించి సురక్షితంగా పట్టుకునేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక అధికారి బి.ఎస్.ఎన్ మూర్తి, సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి, డీఎఫ్ఓ శివకుమార్ పెద్దపులి కదలికలపై నిరంతరం సమీక్ష నిర్వహిస్తూ, అవసరమైన చర్యలపై అధికారులకు సూచనలు చేస్తున్నారని సబ్ డిఎఫ్ఓ సుబ్బారెడ్డి తెలిపారు.

# గ్యాస్ కొరతతో హోటళ్లు మూత!

**హాస్టళ్ల పరిస్థితి మరింత దారుణం**
**ఆర్టీసీ క్రాస్‌రోడ్ బావర్చి మూసివేత**
**ప్యారడైజ్ హోటల్ కూడా అదే దుస్థితి**
**బ్లాక్ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవన్న అధికారులు**

హైదరాబాద్: వంటగ్యాస్ కొరత హోటల్ పరిశ్రమను అతలాకుతలం చేస్తోంది. ఇక్కడ హాస్టళ్లో ఉంటూ చదువుకుంటున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్య దుర్భర పరిస్థితి నెలకొంది. అలాగే హోటల పరిశ్రమపై ఆధారపడ్డ నిరుద్యోగులు కూడా ఆందోళన చెందుతున్నారు. మహానగరంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోయింది. వంటగ్యాస్ సిలిండర్ల సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె. శ్రీనివాస్ తెలిపారు. సిలిండర్లను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయిల్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేశామని, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. నెలకు ఒక సిలిండర్ బుకింగ్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పశ్చిమాసియా యుద్ధం పీజీ యజమానుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. ఓవైపు గ్యాస్ కొరతతో నగరంలోని పలు హోటళ్లను తాత్కాలికంగా మూసేస్తుంటే, మరోవైపు హాస్టళ్ల నిర్వహణపై యజమానులు మల్లగుల్లాలుపడుతున్నారు. కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా బుధవారం నుంచి నగరంలో దాదాపుగా ఆగిపోవడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారింది. గ్యాస్ వినియోగం ఎక్కువ అయ్యే దోసె, పూరీ, చపాతీ వంటకాలను తాత్కాలికంగా అన్ని హాస్టళ్లలో నిలిపివేసినట్లు సమాచారం. గ్యాస్ కొరత తీరేవరకు అన్నం, సాంబారు, కూరతో సాధారణ భోజనాన్ని మాత్రమే అందించగలమని ఐటీకారిడార్‌లోని హాస్టల్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ప్రకటించారు. చికెన్, కోడిగుడ్డుకూర, వేపుళ్లు వంటి అదనపు వంటలను నిలుపుదలచేస్తున్నట్లు తెలిపారు. టీ, కాఫీ లాంటివాటిని అందించలేమని వెల్లడిస్తున్నారు. గ్రేటర్ పరిధిలో మూడు, నాలుగు రోజులుగా సిలిండర్ల బుకింగ్ కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. సర్వర్ డౌన్‌తో బుకింగ్ కావడం లేదంటున్నారు. వాట్సాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం ఉన్నా కా వడం లేదంటున్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని బావర్చి హోటల్‌ను బుధవారం మూసేశారు. గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగానే మూసేసిన్నట్లుగా తెలిసింది. ప్రముఖ ప్యారడైజ్ హోటల్స్ అన్ని బ్రాంచీలలో టీ అమ్మకాలను నిలిపివేశారు. ఐటీసీ సంస్థ కూడా వివిధ ప్రాంతాల్లో గల సంస్థ హోటల్స్‌లో గ్యాస్ కొరత కారణంగా లంచ్, డిన్నర్ ఉండదని ప్రకటించింది. ఒకవేళ దొరికినా కొన్ని ప్రాంతాల్లో రూ. 4 వేలకు, మరికొన్ని ప్రాంతాల్లో రూ. 3,500కు విక్రయిస్తున్నారు. 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర సాధారణంగా రూ. 2105ల వరకు ఉంది. బుధవారం నుంచి కమర్షియల్ సిలిండర్ల సరఫరా పూర్తిగా బంద్ అయింది. పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో కూడా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను నిలిపివేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా లేకపోవడం, మార్కెట్‌లో అధిక ధర ఉండడంతో కొనుగోలు చేయలేక పలు హోటల్స్ మూత పడుతున్నాయి. సిలిండర్ కొరతతో హోటల్స్ మూసేస్తున్నట్లు యజమానులు ప్రకటించారు. అవసరమైతే అవసరమైతే కట్టెల పొయ్యి మీద వంట చేస్తామని చెప్పారు. ఇక పలు ప్రాంతాల్లో టిఫిన్ సెంటర్‌లో కమర్షియల్ సిలిండర్ సరఫరా లేకపోవడంతో హోటల్ మూసివేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టిఫిన్ సెంటర్ బందు చేసుకోవాల్సి వస్తదేమోనని ఆందోళన చెందారు. అఫ్జల్‌గంజ్, బేగంబజార్‌లో కొన్ని టిఫిన్ సెంటర్లలో గ్యాస్ లేకపోవడంతో మూసేస్తున్నారు. వేల రూపాయలు పెట్టి సిలిండర్ కొనుగోలు చేసి వ్యాపారం ఎలా చేస్తామని చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ కొరతతో పలు ప్రాంతాల్లో బిర్యానీ సెంటర్లు మూతపడ్డాయి. పలు ప్రాంతాల్లో వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు దొరక్కపోవడంతో టీ షాపులు, బండి వ్యాపారులు, టిఫిన్ సెంటర్ల నిర్వహకులు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాడుతున్నారు. కొందరూ గృహ వినియోగదారులు 14కిలోల గ్యాస్ సిలిండర్‌ను రూ. 1800ల వరకు అమ్ముతున్నారు. గ్యాస్ సిలిండర్ల కొరతతో హోటళ్లు మూతపడుతున్నాయి. గృహావసరాల సిలిండర్ల సరఫరా తగ్గింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే రూ. 5 భోజనానికి ఇబ్బంది ఉండదని జీహెచ్ఎంసీ వర్గాలు



చెబుతున్నాయి. విద్యుత్‌తో నడిచే యంత్రాలతో భోజనం తయారు చేస్తున్న దృష్ట్యా గ్యాస్ కొరత ప్రభావం తయారీపై ఉండబోదని జీహెచ్ఎంసీ అధికారి ఒకరు తెలిపారు. సిలిండర్లకు ప్రత్యామ్నాయ మర్గాలను నిర్వాహకులు అన్వేషిస్తున్నారని అమీర్‌పేట హాస్టళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు చెబుతున్నారు. బుధవారం అమీర్‌పేట ప్రాంతంలోని హాస్టల్ నిర్వాహకులు 120కుపైగా ఎలక్ట్రికల్ స్టౌలు కొనుగోలు చేసినట్లు సమాచారం. కొందరు కట్టెల పొయ్యి ఏర్పాటుచేసుకున్నారని దుర్గానగర్ హాస్టళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ చెప్పారు. గ్యాస్ కొరత నేపథ్యంలో హాస్టళ్ల యజమానులంతా ఒక్కటయ్యారు. నిర్వహణ విషయంలో తాత్కాలిక నిబంధనలు రూపొందించి అమలుచేస్తున్నారు. విద్యా, ఉద్యోగ అవకాశాల కోసం నగరానికి వచ్చిన యువతకు ఆశ్రయమిచ్చే పేయింగ్ గెస్ట్ హాస్టళ్ల నిర్వహణ ఇప్పుడు మరింత భారంగా మారింది. మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కోర్సులు నేర్చుకోడానికి వచ్చే విద్యార్థుల సంఖ్య ఏడాదిగా బాగా తగ్గింది. దాంతో ప్రైవేటు హాస్టళ్ల వ్యాపారం మందకొండిగా నడుస్తోంది. గ్యాస్ కొరత మమ్మల్ని మరింత నష్టాల్లోకి నెడుతుంది. ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నాం. హాస్టల్‌లో ఉంటున్నవారికి అన్నం, కూర, సాంబారైనా వడ్డించడానికి ప్రత్నిస్తున్నాం అంటున్నారు.

# సినిమా



# రజనీకాంత్ బయోపిక్ రెడీ..



కోలీవుడ్ సూపర్ స్టార్ రజనీకాంత్ అంటే ఉండే క్రేజ్ గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పని లేదు. ఆయన వాకింగ్ స్టైల్, డ్యాన్స్‌కే కోట్లాది మంది అభిమానులు ఫిదా అయ్యారు. బస్ కండక్టర్ స్థాయి నుంచి స్టార్‌గా ఎదిగిన ఆయన ప్రయాణం ఇండస్ట్రీలో ఎందరికో స్ఫూర్తి. ఆయన బయోపిక్ సిల్వర్ స్క్రీన్‌పై రానుందంటూ ఎప్పటి నుంచో ప్రచారం సాగుతోంది. తాజాగా దీనిపై ఆయన కుమార్తె ఐశ్వర్య ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.రజనీ కాంత్ బయోపిక్‌పై తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఐశ్వర్య ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్ చెప్పారు. తన తండ్రి ఆటో బయోగ్రఫీ వర్క్ ఇప్పటికే ప్రారంభం అయినట్లు తెలిపారు. ఇది రిలీజ్ అయ్యాక వరల్డ్ వైడ్‌గా ఓ సెన్సేషన్ అవుతుందని అన్నారు. దీంతో అభిమానుల్లో ఓ కొత్త ఉత్సాహం నెలకొంది. అయితే, ఈ బయోపిక్‌లో ఎవరెవరు నటిస్తున్నారు? ఎవరు డైరెక్ట్ చేయబోతున్నారు? అనే వివరాలు తెలియాల్సి ఉంది. త్వరలోనే దీనిపై క్లారిటీ వచ్చే ఛాన్స్ ఉంది. ఇండస్ట్రీలో ఏఐ వినియోగం మంచిదే అయినా అది ఎప్పటికైనా కృత్రిమమే అనేది గుర్తించుకోవాలన్నారు ఐశ్వర్య. అధునాతన టెక్నాలజీ సాయంతో 'కోచ్చాడయాన్ (2014)' వంటి విజువల్ వండర్ తెరకెక్కించగలిగామని చెప్పారు. వీలైతే భవిష్యత్తులో అలాంటి మూవీస్ తీయడం తనకు ఇష్టమని అన్నారు.

'3', 'లాల్ సలామ్' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన ఐశ్వర్య... 'విత్ లవ్' అనే మూవీకి నిర్మాతగా వ్యవహరించారు. ఈ మూవీలో 'టూరిస్ట్ ఫ్యామిలీ' డైరెక్టర్ అభిషన్ జీవింత్ హీరోగా నటించగా... మదన్ దర్శకత్వం వహించారు. 'ఛాంపియన్' ఫేం అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటించారు. ఫిబ్రవరి 6న సినిమా తెలుగులోనూ రిలీజ్ కానుంది. అటు, రజనీకాంత్ ప్రస్తుతం 'జైలర్ 2'తో బిజీగా ఉండగా జూన్ 12న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్‌ను సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది.

# తమన్నా, పూజా హెగ్డే. మధ్య పోటీ!



కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎంతో మంది హీరోయిన్లు ఉన్నారు, వాళ్ళని బ్రాండ్ అంబాసిడర్ గా ఎంచుకోవచ్చు కదా, ఎందుకు తమన్నా ని ప్రత్యేకించి తీసుకున్నారు. కర్ణాటక లో పుట్టిన పెరిగిన పూజా హెగ్డే ని ఎందుకు ఎంచుకోలేదు?, ఆమెతో పాటు రష్మిక మందాన,రుక్మిణి వాసంత్, శ్రీనిధి శెట్టి వంటి పాన్ ఇండియన్ స్టార్ హీరోయిన్లందరూ కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారే. క్రేజ్, ఫాలోయింగ్, ఫేమ్ విషయంలో వీళ్ళు తమన్నా కి ఏ మాత్రం తీసిపోరు. అయినప్పటికీ వీళ్ళలో ఎవరో ఒకరిని ప్రభుత్వం ఎందుకు ఎంచుకోలేదు అంటూ నిలదీస్తున్నారు. ప్రతి పక్ష పార్టీ కి చెందిన నేతలు.బీజేపీ పార్టీ నాయకులూ కూడా ఈ విషయం లో ప్రభుత్వాన్ని తీవ్ర స్థాయిలో తప్పుబడుతున్నారు. స్థానిక తారలను విస్మరించడం స్థానిక కాంగ్రెస్ నేత కన్నడ వ్యతిరేక మనస్తత్వానికి నిదర్శమని అంటున్నారు. అలా తమన్నా, పూజా హెగ్డే , రష్మిక వంటి హీరోయిన్ల పేర్లు రాజకీయాలకు ఏ మాత్రం సంబంధం లేకపోయినా అక్కడి నేతలు తీస్తున్నారు. అయితే కర్ణాటక ప్రభుత్వం మాత్రం ఈ విమర్శలను లెక్క చేయడం లేదు, వాళ్లకు చేయాలనుకున్న పనులు చేస్తూ ముందుకెళ్తున్నారు.



సినీ రంగం లో తమన్నా, పూజ హెగ్డే లకు ఉన్న క్రేజ్ ఎలాంటిదో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ప్రతీ ఏటా ఎంతో మంది యంగ్ హీరోయిన్లు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టొచ్చు, కానీ వీళ్లిద్దరి క్రేజ్ మాత్రం ఇసుమంత కూడా తగ్గలేదు. హిట్, ఫ్లాప్ లతో సంబంధం లేకుండా,వరుసగా సినిమాలు చేస్తూ దూసుకెళ్తున్నారు ఈ ఇద్దరు హీరోయిన్స్. అయితే వీళ్లకు ఏ మాత్రం సంబంధం లేని రాజకీయాలు, ఇప్పుడు వీళ్లిద్దరు చుట్టూ తిరుగుతున్నాయి. పూర్తి వివరాల్లోకి వెళ్తే కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యం లో ఉండే మైసూర్ శాండిల్ సోప్‌కి బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించేందుకు తమన్నాని ఎంపిక చేశారు. ఒకప్పుడు దేశవ్యాప్తంగా మైసూర్ శాండిల్ సోప్స్ కి ఉన్న క్రేజ్ మామూలుది కాదు. ఈమధ్య కొత్త ప్రొడక్ట్స్‌కారణంగా ఈ బ్రాండ్ కి కాస్త క్రేజ్ తగ్గింది.అందుకే ప్రభుత్వం ఈసోప్‌ను రీ బ్రాండింగ్ చేస్తూ, నేడు లాంచింగ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. అయితే ఈ బ్రాండ్ కి తమన్నా ని ఎంపిక చేయడం పై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి.

# 'ఫౌజీ'తో యాక్షన్‌కు రెడీ..



రెబల్ స్టార్ కృష్ణంరాజు నట వారసుడిగా సినీ పరిశ్రమలో అడుగుపెట్టి, ప్రస్తుతం భారతదేశంలోనే అతిపెద్ద సూపర్‌స్టార్లలో ఒకరిగా ఎదిగారు ప్రభాస్.ఇప్పుడు వరుస పాన్ ఇండియా చిత్రాలతో అభిమానుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. భారీ బడ్జెట్ సినిమాలు, దేశవ్యాప్త విడుదలలు, అంతర్జాతీయ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకున్న కథలతో ఆయన రేంజ్ మరింత పెరుగుతోంది. సినిమా ఫలితాలతో సంబంధం లేకుండా వందల కోట్ల వసూళ్లు సాధించడం ప్రభాస్ ప్రత్యేకతగా ట్రేడ్ వర్గాలు చెబుతుంటాయి. ఇలాంటి సమయంలో ఆయన నటిస్తున్న తాజా చిత్రం ఫౌజీ షూటింగ్‌లో స్వల్ప ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. గుర్రపు స్వారీ సన్నివేశం చిత్రీకరణ సమయంలో ప్రభాస్ కింద పడిపోవడంతో చేతులకు చిన్న గాయాలు అయినట్లు సినీ వర్గాలు వెల్లడించాయి. చిత్రబృందం వెంటనే స్పందించి ప్రథమ చికిత్స అందించగా, గాయాలు తీవ్రంగా లేవని తెలిసింది. వైద్యులు ఒకటి రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.ప్రస్తుతం ప్రభాస్ సురక్షితంగానే ఉన్నారని, త్వరలోనే మళ్లీ షూటింగ్‌లో పాల్గొననున్నారని యూనిట్ తెలిపింది. ఈ వార్తతో అభిమానులు తొలుత ఆందోళన చెందగా, గాయాలు చిన్నవేనని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. 'ఫౌజీ' చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో సీతారామంతో ప్రశంసలు అందుకున్న ఆయన, ఈసారి మరింత ఎమోషన్‌తో కూడిన యాక్షన్ డ్రామాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని టాక్. ఈ సినిమాలో ప్రభాస్ బ్రిటిష్ సైనికుడి పాత్రలో కనిపించనున్నారని సమాచారం. దేశభక్తి, ప్రేమ, త్యాగం వంటి అంశాలతో కథ నడుస్తుందని తెలుస్తోంది. గుర్రపు స్వారీతో కూడిన హై వోల్టేజ్ చేజింగ్ సన్నివేశం సినిమాకే హైలైట్‌గా నిలవనుందని, భారీ సెట్స్ మరియు విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సన్నివేశాలను రూపొందిస్తున్నారని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ చిత్రంలో ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇదిలా ఉండగా ప్రభాస్ తదుపరి చిత్రం స్పిరిట్‌పై కూడా భారీ అంచనాలే ఉన్నాయి. ఈ చిత్రానికి సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తుండగా, పోలీస్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూ స్తున్నారు. హీరోయిన్‌గా త్రిప్తి దిమ్రీ నటిస్తుండగా, టి-సిరీస్ నిర్మిస్తోంది. ఇప్పటికే విడుదల తేదీని ప్రకటించగా, ఈ చిత్రం వచ్చే ఏడాదిమార్చి 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల ది రాజా సాబ్‌తో ఆశించిన ఫలితంఅందుకోలేకపోయిన ప్రభాస్‌చేతిలో ప్రస్తు తం ఫౌజీ, స్పిరిట్‌తో పాటు సలార్ 2, కల్కి 2 వంటి భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ వరుస చిత్రాలతో ప్రభాస్ రేంజ్ మరింత పెరగడం ఖాయమనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# వారణాసిలో శివభక్తుడిగా ప్రకాశ్ రాజ్



భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'పై రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా, దర్శకధీరుడు ఎస్. ఎస్. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం పాన్ వరల్డ్ స్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటి వరకు సినిమా విషయాలపై గోప్యత పాటించిన రాజమౌళి, ఇటీవల ఒక్కో అప్డేట్‌ను బయట పెడుతూ అభిమానుల్లో హైప్‌ను మరింత పెంచుతున్నారు. ఈ సినిమాలో మహేష్ బాబు 'రుద్ర' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపిం చనుండగా, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా 'మందాకిని' పాత్రలో నటిస్తోంది. మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ'పాత్రలో కనిపించనున్నాడు. ఈ ముగ్గురు ప్రధాన పాత్రల ఫస్ట్ లుక్స్‌ను ఇప్పటికే చిత్రబృందం విడుదల చేయగా, టైటిల్ టీజర్ ద్వారా 'వారణాసి వరల్డ్' ఎలా ఉండబోతుందో ఒక విజువల్ శాంపిల్‌ను చూపించారు. ఓ హాలీవుడ్ ఇంటర్వ్యూలో రాజమౌళి సినిమా జానర్, కథ నేపథ్యంపై స్వల్ప హింట్స్ కూడా ఇచ్చారు. ఇదిలా ఉండగా, ఈ చిత్రంలో రామాయణానికి సంబంధించిన ఓ ఎపిసోడ్ కూడా ఉండబోతుందని రాజమౌళి స్వయంగా వెల్లడించారు. కొన్ని నిమిషాల పాటు మహేష్ బాబు శ్రీరాముడి పాత్రలో కనిపించనున్నట్లు తెలిపారు. ఆ ఎపిసోడ్ షూటింగ్ ఇప్పటికే పూర్తయ్యిందని, ప్రస్తుతం వీఎఫ్ఎక్స్ పనులు జరుగుతున్నాయని సమాచారం. ఈ అంశం సినిమా మీద అంచనాలను మరింత పెంచింది. ఇక తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన మరో ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ ఈ సినిమాలో నటిస్తున్న విషయం కొంతకాలం క్రితమే వెల్లడించగా, ఇప్పుడు తన పాత్రను కూడా స్వయంగా బయటపెట్టారు. ఇటీవల ఓ న్యూస్ ఛానల్ డిబేట్‌లో పాల్గొన్న ఆయన, 'వారణాసి' చిత్రంలో తాను మహా శివభక్తుడి పాత్ర పోషిస్తున్నానని తెలిపారు. ఈ పాత్ర తన నటనా జీవితంలో మరో ప్రత్యేకమైన మైలురాయిగా నిలుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రకాశ్ రాజ్ గతంలో రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'విక్రమార్కుడు' చిత్రంలో నటించారు. అలాగే మహేష్ బాబుతో 'రాజకుమారుడు' నుంచి 'గుంటూరు కారం' వరకు అనేక హిట్ చిత్రాల్లో కలిసి నటించారు. వీరిద్దరి కాంబినేషన్‌కు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆదరణ ఉంది. గతంలో 'ఢమరుకం' చిత్రంలో శివుడి పాత్రలో కనిపించిన ప్రకాశ్ రాజ్, ఇప్పుడు శివభక్తుడిగా నటించడంవిశేషం. ప్రస్తుతం 'వారణాసి' తదుపరి షెడ్యూల్‌కు చిత్ర బృందం సిద్ధమవుతోంది. విజువల్ గ్రాండియర్, మైథాలజీ ఎలిమెంట్స్, యాక్షన్ అడ్వెంచర్ మేళవింపుతో రూపొందుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సమ్మర్ సీజన్‌లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అభిమానులు మాత్రం ఈ సినిమాను భారతీయ సినిమా గర్వంగా నిలిచే ప్రాజెక్ట్‌గా భావిస్తూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# అభిమానుల్లాగే నేనూ వెయిటింగ్..

## అకీరా నందన్ సినీ ఎంట్రీపై అడివి శేష్ ఆసక్తికర వ్యాఖ్యలు!



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ తనయుడు అకీరా నందన్ సినీ అరంగేట్రం ఎప్పుడు జరుగుతుందా అని మెగా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో యువ హీరో అడివి శేష్ చేసిన తాజా వ్యాఖ్యలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ క్రమంలో అకీరాతో అడివి శేష్.. అకీరాతో తనకున్న అనుబంధం, ఆయన సినీ భవిష్యత్తు గురించి మాట్లాడారు. గత కొంతకాలంగా అకీరా సినీ ఎంట్రీ కోసం అడివి శేష్ ఒక ప్రత్యేకమైన కథను సిద్ధం చేశారని ప్రచారం జరుగుతోంది. ఈ వార్తలపై శేష్ స్పందిస్తూ.. "అకీరాకు ఇప్పటికే విపరీతమైన అభిమానగణం ఉంది. ఆయన ఎంట్రీ కోసం లక్షలాది మంది అభిమానుల లాగే నేను కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని తెలిపారు. అకీరా ఎప్పుడు ఇండస్ట్రీలోకి వచ్చినా అది ఒక పెద్ద సంచలనం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అకీరాతో తనకున్న వ్యక్తిగత బంధం గురించి శేష్ వివరిస్తూ.. "అకీరా నాకు వ్యక్తిగతంగా చాలా ఇష్టం. మేమిద్దరం అప్పుడప్పుడు కలుస్తుంటాం. మా ఇద్దరి మధ్య ఒక కామన్ పాయింట్ ఉంది. మేమిద్దరం 'లెఫ్ట్ హ్యాండర్స్' (ఎడమచేతి వాటం ఉన్నవారు). ఆ విషయంలో మా మధ్య మంచి సింక్ కుదిరింది" అని నవ్వుతూ చెప్పారు. అకీరా ఆలోచనా విధానం, ఆయన పరిణతి తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని శేష్ ప్రశంసించారు.

నటుడిగా వస్తాడా? సంగీత దర్శకుడవుతాడా? : ప్రస్తుతం అకీరా నందన్ అకీరానందన్ ప్రస్తుతం విదేశాలలోసంగీతంలో శిక్షణ పొందుతున్నట్లు సమాచారం. గతంలో ఆయన తల్లి రేణు దేశాయ్ కూడా తన కొడుక్కి సంగీతంపైనే మక్కువ ఎక్కువని, కెరీర్ ఎంపిక పూర్తిగా అతనికే వదిలేశామని స్పష్టం చేశారు.

Printed by Published by KANDADI MAHENDER REDDY on behalf of KANDADI MAHENDER REDDY,
Printed at and Published at Flat no.101, Ushodaya Towers, IDA Jeedimetla, Quthbullapur editor KANDADI MAHENDER REDDY.